ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్టం : 40.0
కనిష్టం : 24.0



నారాయణపురంలో సీఎం జగన్ బస చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

నేడు సీఎం జగన్ రాక

పెదవేగి/ ఉంగుటూరు, ఏప్రిల్ 14 : సీఎం వైఎస్ జగన్ మేము సిద్ధం బస్ యాత్ర సోమవారం జిల్లాలో జరగనుంది. కృష్ణా జిల్లా కేసరపల్లిలో ఆదివారం రాత్రి బస చేసిన ఆయన సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు తిరిగి ప్రచారం ప్రారంభిస్తారు. గన్నవరం, ఆత్కూరు, కోడూరు పాడు, హనుమాన్ జంక్షన్, కానుమోలు, పుట్టగుంటమీదుగా జొన్నపాడు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం భోజన విరామం ఉంటుంది. తిరిగి సాయంత్రం నాలుగు గంటలకు జొన్నపాడు నుంచి బయలుదేరి జనార్ధనపురం, నాగవరప్పాడు చేరుకుంటారు. అక్కడ 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. తిరిగి ఆరుగొలను, హనుమాన్ జంక్షన్ మీదుగా ఏలూరు జిల్లాలో సీఎం ప్రచారం ప్రారంభమవుతుంది. ఏలూరు, దెందులూరు, భీమడోలు, కైకరం వరకు ప్రచారం నిర్వహిస్తారు. రాత్రి ఎనిమిది గంటలకు నారాయణపురం చేరుకుని, అక్కడ రాత్రి బస చేస్తారని సీఎం అడిషనల్ పీఎస్ నాగేశ్వరరెడ్డి తెలిపారు. కాగా సీఎం జగన్ బస చేసే ప్రాంతాన్ని ఆదివారం సాయంత్రం జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆమె వెంట ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, స్పెషల్ బ్రాంచ్ సీఐ మల్లేశ్వరరావు, నిడమర్రు సీఐ మోగంటి వెంకట సుభాష్, చేబ్రోలు ఎస్ఐ ఏ.మణి కుమార్ తదితరులు పాల్గొన్నారు

నెలాఖరులోగా 'ఓపెన్' దూరవిద్య పరీక్షల ఫలితాలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14 : ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఆదివారం ముగిసింది. శనివారం ప్రారంభమైన స్పాట్ వాల్యూయేషన్ కేవలం రెండు రోజుల వ్యవధిలోనే ముగియడం విశేషం. ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాలు మొత్తం 6,500 జిల్లాకు వచ్చాయి. కాగా ఈ పరీక్షల ఫలితాలు నెలాఖరులోగా ప్రకటించే అవకాశాలున్నాయి.

పోలవరంలో సమస్యల తిష్ఠ

అభివృద్ధికి ఆమడ దూరం..
7

దోబూచులాట!

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనువుగా నామినేషన్ల దాఖలు చేసే ప్రక్రియ కొద్దిరోజుల్లోనే ఆరంభం కానుంది. కాని ఉమ్మడి కూటమిలో సీట్ల సర్దుబాటు ఇంకా దోబూచులాటగానే ఉంది. ప్రత్యేకించి కొన్ని స్థానాల్లో మార్పులు, చేర్పులకు అనువుగా ఈ మధ్యనే కూటమి అగ్రనాయకుల మధ్య సమీక్ష సాగింది. పలు అంశాలు చర్చకు వచ్చాయి. ఇప్పటివరకు సీటు దక్కక తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంతో రగిలిపోతున్న వారికి ప్రత్యామ్నాయంగా సీటు కేటాయించాలన్న డిమాండ్ మరోసారి ముందు కొచ్చింది. సోమవారం సాయంత్రం నాటికి కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.

- ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- సీట్ల మార్పిడి అంటూ దుమారం
- రోజుకో సీటు లింకుపెట్టిమరీ ప్రచారం
- బీజేపీ తాజా డిమాండ్‌తో రాజకీయ ఆసక్తి
- తపనా చౌదరికి సీటుకోసం కమలనాథుల పట్టు
- నేటి సాయంత్రం నాటికి కీలక పరిణామాలు



బీజేపీ వ్యూహం ఏంటి?

భారతీయ జనతా పార్టీ ఉమ్మడి పశ్చిమలోనే తమపార్టీ అభ్యర్థులు పోటీచేసే సీట్లపై ఇంకా తడబడుతూనే ఉంది. ఇంకోవైపు సీటు ఆశించి అదీ కుదరక డీలా పడిన వారికి ఏదోఒక సీటులో ప్రత్యామ్నాయంగా పోటీకి నిలపాలని ఆ పార్టీ భావిస్తోంది. రెండురోజుల క్రితమే టీడీపీ, జనసేన, బీజేపీ అగ్రనాయకుల మధ్య కీలక చర్చలు జరిగాయి. మార్పులు, చేర్పుల అంశం తెర ముందుకు వచ్చింది. ఏలూరు ఎంపీ స్థానాన్ని ఆశించిన తపనా చౌదరికి ఎట్టి పరిస్థితుల్లోనూ అసెంబ్లీకి పోటీచేసే అవకాశాన్ని కల్పించాలని ఆపార్టీ గట్టిపట్టుదలతోనే ఉంది. ఇదే విషయాన్ని బీజేపీ నేతలు, తెలుగుదేశం అభ్యర్థి చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ చెవిన వేశారు. బీజేపీ ఆదినుంచి ఏలూరు ఎంపీ స్థానం, ఉంగుటూరు అసెంబ్లీ స్థానాన్ని ఆశిస్తూ వచ్చిన సీట్ల కేటాయింపు వచ్చేసరికి ఈ రెండుస్థానాలను ప్రస్తావించ కుండా వదిలేసింది. ఈ నేపథ్యంలోనే ఆ పార్టీలో అంతర్గత అసంతృప్తికి దారితీసింది. పార్టీ రాష్ట్రప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న తపనా చౌదరి ఆశిస్తున్న ఏలూరు లోక్‌సభ స్థానాన్ని తెలుగుదేశంకు కేటాయిం చారు. ఈ స్థానం నుంచి ఇప్పటికే టీడీపీ అభ్యర్థిగా పుట్టా మహేష్ కుమార్ యాదవ్ రంగంలో ఉన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఆయన సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఏలూరు ఎంపీ సీటు ఎలాగో దక్కలేదు కాబట్టి తమ నేత తపనా చౌదరికి కనీసం అసెంబ్లీకి పోటీచేసే అవకాశమైనా ఏదో సీటు కేటాయించాలంటూ బీజేపీ కొత్తగా ప్రతిపాదించింది. పార్టీని నమ్ముకుని సుదీర్ఘ కాలం పాటు సేవలు అందించిన చౌదరి ఇక తన రాజకీయ భవిష్యత్తుపై అటో ఇటో తేల్చుకోవాలని నిర్ణయించిన తర్వాతే బీజేపీ ఒక్కసారిగా మేల్కొంది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఎలాగో అనపర్తి స్థానాన్ని తమ పార్టీ వదులు కుంటున్నందున ప్రత్యామ్నాయంగా ఏదో ఒక అసెంబ్లీ స్థానం తమకు కేటాయించాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు దాని ప్రభావం ఏలూరు జిల్లాపై పడింది. ఇదే జిల్లా పరిధిలో ఉంగుటూరు స్థానాన్ని ఇప్పటికే జనసేనకు కేటాయించారు. అయినా కూడా తిరిగి ఉంగుటూరు స్థానాన్నే పదేపదే ప్రస్తావిస్తూ ఉండడంతో జనసేన సేనాని పవన్‌తో పాటు చంద్రబాబు వ్యతిరేకించారు. మరే ఏ స్థానం నుంచి బీజేపీకి అవకాశం ఇవ్వాలనే దానిపై తర్జనభర్జన జరుగుతోంది. ప్రత్యేకించి తపనా చౌదరికి అవకాశం ఇవ్వాలంటే ఏ స్థానాన్ని కేటాయిస్తారనే దానిపై తెలుగుదేశంలోనూ కాస్తా గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలోనే గడిచిన రెండురోజులుగా వివిధ నియోజకవర్గాల పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. కొందరు అదే నియోజకవర్గం నుంచి బీజేపీ పోటీ చేయబోతున్నదంటూ బెట్టింగ్‌లకు దిగడంతో పరిస్థితి మరింత గందరగోళంగా మారింది. తాము ఎలాగో ఒక సీటును వదులుకుంటున్నందున ప్రత్యామ్నాయంగా ఇంకో సీటు కేటాయించాల్సిందేనన్న బీజేపీ పట్టుదలతో తెలుగుదేశం కూడా దీనికి సమ్మతించినట్టు సమాచారం.

ఏ సీటు కేటాయిస్తారో..

ఏలూరు జిల్లా లోనే ఏదోస్థానం కేటాయిస్తారంటూ తాజా చర్చల దరిమిలా అసలు విషయం ధ్రువపడింది. కాని అది ఏ నియోజకవర్గం అనేది సస్పెన్స్‌లో పడింది. సోమవారం సాయంత్రానికల్లా దీనిపై తుది నిర్ణయం తీసుకుంటారని సంకేతాలు వస్తున్నాయి. వాస్తవానికి కూటమిలో ఈ తరహా పరిస్థితులు తలెత్తడం సీనియర్లను బెంబేలెత్తిస్తోంది. ఒకానొక దశలో తపనా చౌదరి కూడా కాస్తంత ఘాటైన చర్యలకు దిగాలని భావించారు. ఏలూరు ఎంపీ స్థానం నుంచే తాను పోటీలో ఉంటానంటూ తన కేడర్‌కు సంకేతాలు ఇచ్చారు. పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటారా లేదా అనేది పక్కనపెట్టి దూకుడుగానే ముందుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఓ అడుగు కిందకు దిగి తపనా చౌదరి వైపు ఫోకస్ పెట్టింది. ఏదైతే అనపర్తి స్థానంలో కొత్తగా కోరుకుంటున్న అసెంబ్లీ స్థానం నుంచే చౌదరిని పోటీ చేయించాలనే యోచనలో ఆ పార్టీ ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఏడు నియోజకవర్గాల్లో పోలవరం, ఉంగుటూరు జనసేనకు కేటాయించగా, కైకలూరును బీజేపీకి కేటాయించారు. ఇక దెందులూరు, ఏలూరు, నూజివీడు, ఎస్సీ రిజర్వుడ్ స్థానమైన చింతలపూడి అసెంబ్లీ నియోజక వర్గాలు ఉండగా, వీటిలోనూ టీడీపీ అభ్యర్థులు ప్రచారంలో హోరెత్తిస్తున్నారు. మరి ఇలాంటి తరుణంలో ఏ సీటు బీజేపీకి ఇస్తారనే దానిపైనే గందరగోళం నెలకొంది. ఫలానా నియోజకవర్గం బీజేపీ ఖరారు అయిందని కొందరు, ఆ స్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థిని పక్కకు తప్పించటానికి సిద్ధంగా ఉన్నారని మరికొందరు ఎవరినోటికి వచ్చినట్టు వారు ప్రచారం కొనసాగిస్తున్నారు. దీనికితోడు పోలవరం నియోజక వర్గంలో జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు తమపార్టీకి సహకరించడం లేదని స్థానిక తెలుగుదేశం నాయకత్వం గుర్రుగా ఉంది. ఇదే విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లబోతున్నారు. నూజివీడు లోనూ టీడీపీ రెబల్ అభ్యర్థి సవాళ్ళు, ప్రతి సవాళ్ళు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇక్కడ కూడా వాటిని ఏమాత్రం ఖాతరు చేయకుండా ముందుకు వెళ్ళాలని తెలుగుదేశం పట్టుదలతో ఉంది. నామినేషన్‌ల గడువుకు సమీపిస్తుండగా ఈ లోపే ఈ సీట్ల మార్పిడి వ్యవహారం కార్యకర్తలకు ఏ మాత్రం రుచించడం లేదు.





మామిడి తోటలను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా ఉద్యానవన అధికారి ఎస్.రామ్మోహన్

విదేశాలకు నూజివీడు మామిడి

- ఉద్యానవనశాఖ అధికారి రామ్మోహన్

నూజివీడు టౌన్, ఏప్రిల్ 14 : ప్రస్తుత సీజన్‌లో నూజివీడు మామిడిని కెనడా, అమెరికా దేశాలకు ఎగుమతి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఏలూరు జిల్లా ఉద్యాన వనశాఖ అధికారి ఎస్.రామ్మోహన్ తెలిపారు. నూజివీడు మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మామిడిరైతు ఎం.బి.వి రాఘవరావు, మామిడి తోటను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్గానిక్ విధానంలో రాఘవరావు ఎనిమిది ఎకరాల్లో బంగినపల్లి, చిన్నరసం, చెరుకు రసాలను సాగు చేశారని, కాయల నాణ్యత బాగుందని, ఈనెల 16వ తేదీన (మంగళవారం) 1.2 టన్నుల మామిడిపండ్లను కెనడాకు, 25వ తేదీన అమెరికాకు ఎగుమతి చేయనున్నట్టు తెలిపారు. గత సీజన్‌లో జిల్లా నుంచి 125 టన్నుల మామిడిని బ్రిటన్, కెనడా, సౌదీ అరేబియా, దుబాయ్, అమెరికా వంటి దేశాలకు ఎగుమతి చేశామని, ప్రస్తుత సీజన్‌లో 300 టన్నుల మామిడికాయలను నూజివీడు ప్రాంతం నుంచి ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నూజివీడు ఉద్యానవనశాఖ అధికారిణి ఆర్.హేమ, మామిడి రైతు రాఘవరావు, ఇతర రైతులు పాల్గొన్నారు.

22న నామినేషన్ వేస్తా

- ఎంపీ రఘురామకృష్ణరాజు



ఉండి, ఏప్రిల్ 14: తాను ఎక్కడ నుంచి పోటీ చేస్తాననేది రెండు రోజుల్లో క్లారిటీ వస్తుందని అది ఎంపీగానా లేక ఎమ్మెల్యేగానా అనేది త్వరలో చెబుతానని నరసాపురం పార్లమెంటు సభ్యుడు కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. నామినేషన్ మాత్రం ఈనెల 22న వేస్తానని స్పష్టం చేశారు. ఆదివారం ఆయన ఉండి మండలం వెలివర్రులోని వీర పేరంటాలమ్మ అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు అమ్మవారి ఆశీర్వాదం తీసుకోవడం తనకు సెంటిమెంట్ అన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని జగన్ ఓడిపోవాలని కోరుకున్నట్టు తెలిపారు. గతంలో తాను ఎంపీగా ఎన్నికైన తరువాత అమ్మ వారి ఆలయానికి వచ్చేసి మొక్కలను నాటానని ఈ ప్రాంతమంతా పచ్చని చెట్లతో కళకళలాడుతుందన్నారు. సీఎం వస్తున్నారంటే ఆ ప్రాంతంలో ఉన్న పచ్చని చెట్లను అధికారులు నిర్దాక్షిణ్యంగా నరికేస్తున్నారని అన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి



కలెక్టరేట్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, తదితరులు

ఏలూరు కలెక్టరేట్/ ఏలూరు క్రైం, ఏప్రిల్ 14 : జిల్లా వ్యాప్తంగా ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో ఆదివారం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ లావణ్యవేణి, డీఆర్వో పుష్పమణి, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్, జేసీ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాత్ర మరువరానిదన్నారు. గొప్ప దేశభక్తి, మానవతా విలువలు కలిగిన అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ జేడీ జయప్రకాష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ్‌రాజు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మేరీ ప్రశాంతి అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చూపించిన మార్గంలో యువత నడుచుకోవాలని సూచించారు. ఏఎస్పీ జి స్వరూపరాణి, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఏలూరు ట్రాఫిక్ సీఐ కె శ్రీనివాసరావు, ఎఆర్ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ఇన్సూరెన్స్ సొమ్ములకు.. ఎసరు!


ఉంగుటూరు మండలంలో పని చేస్తున్న ఒక ఉపాధ్యాయుడు 2008 డీఎస్సీ ద్వారా అపాయింట్ అయ్యారు. అతనికి 2011 నుంచి 2020 వరకు మిస్సింగ్ క్రెడిట్స్ వచ్చాయి. అంటే మినహాయించబడిన ప్రీమియం సొమ్ము వారి ఖాతాలో జమ కాలేదు. అతను 2013లో అంతర్ జిల్లా బదిలీలో ఈ జిల్లాకు వచ్చాడు. ఇప్పుడు పూర్వ జిల్లా నుంచి షెడ్యూల్స్ బిల్ నెంబర్స్ ఏ విధంగా తెచ్చుకోగలడు. మిస్సింగ్ క్రెడిట్స్ సొమ్ములు ఎక్కడకు పోయినట్టు.

2012 డీఎస్సీ ద్వారా ఎంపికై వీరవాసరం మండలంలో పని చేస్తున్న ఒక స్కూల్ అసిస్టెంట్ తన సర్వీసులో ఇప్పటికే నాలుగు చోట్లకు బదిలీ అయ్యాడు. ఇప్పుడు మిస్సింగ్స్ క్రెడిట్స్ పేరుతో పంపిన నోటీసులో ఏకంగా ఏడు నెలల ప్రీమియం సొమ్ము జమకాలేదని పేర్కొన్నారు. ఇలా 12 ఏళ్ల తర్వాత ప్రీమియం సొమ్ములు కట్టలేదం టూ సెలవివ్వడం ఎంతవరకు న్యాయమని ఆ ఉద్యోగి ప్రశ్నిస్తున్నాడు.

- ఏపీజీఎల్ఐ ఖాతాదారుల్లో ఆందోళన
- ఉద్యోగుల జీతం నుంచి సొమ్ము మినహాయింపు
- మిస్సింగ్స్ క్రెడిట్స్ 15 ఏళ్లకు పైనే..
- ట్రెజరీ బిల్లులు మినహాయింపు..కానీ జమలేదు
- రిటైర్డ్ ఉద్యోగులు సొమ్ముల కోసం రెండేళ్లుగా ఎదురు చూపులు
- ఏపీజీఎల్ఐ రుణాల కోసం పడిగాపులు



నిడమర్రు ఏప్రిల్ 14 : ఓ ఉద్యోగి తాను కష్టపడి సంపాదించిన సొమ్ము ఓ ప్రభుత్వ సంస్థలో దాచుకొంటే ఆ సొమ్ములు గల్లంతవుతున్నాయి. తన జీతం నుంచి నెల నెలా మినహాయించి దాచిపెట్టుకొన్న సొమ్ములు ఎక్కడో పోయాయో తెలియక ఏమి చేయలేని పరిస్థితి నేడు ఉద్యోగులలో నెలకొంది. ప్రభుత్వ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఏపీజీ ఎల్ఐ) సంస్థలో పాలసీలు కడుతున్న ఉద్యోగుల ప్రీమియం సొమ్ములు జమ సంబంధిత డ్రాయింగ్ అథారిటీ ద్వారా మినహాయించబడుతూ ట్రెజరీ ద్వారా ఆ సంస్థకు నెలనెలా జమ చేయబడతాయి. కానీ నేడు ఏపీజీ ఎల్ఐ సంస్థలో ఉద్యోగుల సొమ్ములు ఖాతాల్లో జమకాలేదని 15 ఏళ్ల తర్వాత చావుకబురు చల్లగా చెప్పారు సంబంధిత శాఖ వారు. ఖాతాలో సొమ్ములు జమ కాకుంటే ఏటా ఆ వివరాలు చెప్పడం మానివేసి ఒక్కసారిగా 15 ఏళ్ల తర్వాత చెప్పడం ఎంతవరకు సమంజసమని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా సంస్థ రాష్ట్రంలో పనిచేసే ఉద్యోగులకు ఇన్సూరెన్స్ నిమిత్తం ప్రీమియం సొమ్మును కట్టించుకుని జీవిత బీమా పాలసీని అందజేసేవారు. ఉద్యోగి రిటైర్‌మెంట్ సమయంలో వారికి మొత్తం ఇన్సూరెన్స్ సొమ్మును అందజేసేవారు. కానీ నేడు ఈ సంస్థ ఉద్యోగులను నట్టేట ముంచింది. ఉమ్మడి జిల్లాలో అన్ని శాఖల ఉద్యోగులు సుమారు 70 నుంచి 80 వేల మంది ఉంటారు. వీరికి సంబంధించి సుమారు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్లు ప్రీమియం సొమ్ము గల్లంతు అయ్యిందని ఉద్యోగ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇది ఆయా సంస్థలో పనిచేసే ఉద్యోగుల పొరపాటా లేక సొమ్ములు కాజేశారా..? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021 డిసెంబరులో ఉద్యోగ విరమణ చేసిన ఓ విశ్రాంత ఉద్యోగికి తాను దాచుకొన్న జీవిత బీమా సొమ్ము చెల్లించడానికి ప్రభుత్వానికి సుమారు రెండేళ్లు పట్టిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సర్వీసులో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఈ రకమైన ఇబ్బందే ఎదుర్కొంటున్నారు. తమ ఆపత్కాలంలో అత్యవసర సమయంలో లోన్ ద్వారా తమ ఖాతాలో సొమ్ము విత్‌డ్రా చేసుకొందామని దరఖాస్తు చేసుకుంటే 10 నుంచి 12 నెలలకు గాని మంజూరు కావడం లేదు.


Policy Details
Missing Credits (Total Months)
Loan Details
No Active loans

ఓ ఉద్యోగికి చెందిన ఏపీజీఎల్ఐ ప్రీమియం మిస్సింగ్ క్రెడిట్స్ స్టేట్‌మెంట్స్

మిస్సింగ్స్ క్రెడిట్స్ 15 ఏళ్లకు పైనే..

ఏపీజీఎల్ఐ యాజమాన్య లోపం వల్ల ఉద్యోగులకు సంబంధించి గత 15 ఏళ్లుగా జమ కాని ప్రీమియం సొమ్ములను ఉద్యోగులు కోల్పోవాల్సి వస్తోంది. 2009 నుంచి ట్రెజరీ బిల్లుల్లో మినహాయించినా ఈ ప్రీమియం సొమ్ములు అందలేని ఇప్పుడు తెలపడం ఏంటని ఉద్యోగ వర్గాలు ప్రశ్నిస్తున్నాయి.

పేమెంట్స్ జమలేదెందుకు?

ఏ ప్రభుత్వ సంస్థ అయినా ఏటా తమ ఖాతాలను జమ చేయబడిన సొమ్ము, ఖర్చు అయిన సొమ్ములపై ఆడిట్ నిర్వహిస్తుంది. కానీ ఒక జీవిత బీమా సంస్థ అయి ఉండి ఉద్యోగుల ప్రీమియం సొమ్ముల చెల్లింపులో ఇంత అలసత్వం ఏంటని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నాయి. ప్రతినెలా ట్రెజరీ ద్వారా వచ్చే ఆన్‌లైన్ పేమెంట్స్‌ను ఉద్యోగులకు వారి ఖాతాలో జమ చేయడంలో ఎందుకు అలసత్వమో అర్థం కావడం లేదు.



ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను, ఎమ్మెల్యే అభ్యర్థి చంటిని సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

నీ వెంటే మేము

- ఆర్యవైశ్య, కాపు ఆత్మీయ సమ్మేళనం
- పలు కార్యక్రమాల్లో ఎంపీ అభ్యర్థి మహేష్ బిజీబిజీ

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 14: రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, తామంతా మీ వెంటే ఉంటామని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు ఆర్యవైశ్యులు, కాపులు స్పష్టం చేశారు. మహేష్ యాదవ్ ఆదివారం పలు కార్యక్రమాల్లో బిజీబిజీగా గడిపారు. క్రాంతి కల్యాణ మండపంలో ఆర్యవైశ్యులు,కాపుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి రాగానే ఉపాధి కల్పనకు చర్యలు చేపడతామన్నారు. అమరావతి రాజధానిని నిర్మిస్తామన్నారు. ఏలూరును ఐటీ హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జగన్ పాలనలో కాపులు, ఆర్యవైశ్యులు జగన్ పాలనలో ఆర్థికంగా వెనకబడిపోయారన్నారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై మాట్లాడుతూ జగన్ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించాడని, ఎటువంటి పరిశ్రమలు తీసుకురాకుండా యువత భవిష్యత్తు నిర్వీర్యం చేశాడన్నారు. తాము అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఉపాధి కల్పనకు పెద్దపీట వేసి యువతకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం ఎన్‌టీఆర్ నగర్‌లో ఆర్‌సీఎం చర్చ్‌లో ఫాదర్ జేవియర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎంపీ అభ్యర్థిగా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి బడేటి చంటి, ఏలూరు జనసేన ఇన్‌చార్జ్ రెడ్డి అప్పలనాయుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మహేశ్ యాదవ్

నేటి నుంచి హోం ఓటింగ్ అర్హుల గుర్తింపు

- రిటర్నింగ్ అధికారి ముక్కంటి

ఏలూరుసిటీ, ఏప్రిల్ 14 : సాధారణ ఎన్నికలు మే 13న జరగనున్న నేపథ్యంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 85 ఏళ్ల వయస్సు పైబడి, తీవ్ర అనారోగ్యానికి గురై కదలలేని స్థితిలో ఉన్న ఓటర్లకు, 40 శాతం పైబడి అంగవైకల్యం ఉన్నట్టుగా ధ్రువపత్రం కలిగి కదలలేని పరిస్థితుల్లో ఉన్న పీడబ్ల్యూడీ ఓటర్లకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కోసం హోం ఓటింగ్‌ను భారత ఎన్నికల సంఘం కల్పించిందని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు యూనిట్-2 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణ) ముక్కంటి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు నియోజకవర్గంలో అటువంటి ఓటర్ల వివరాలను ఈనెల 15 నుంచి 17 వతేదీ వరకు మూడు రోజుల పాటు బూత్ స్థాయి అధికారులు సేకరిస్తారన్నారు. వారి పరిధిలో గల హోమ్ ఓటింగ్ నకు అర్హత కలిగిన ఓటర్లను గుర్తించడం కోసం స్వయంగా వారి గృహాల వద్దకు వెళ్లి పరిశీలించి వారి వివరాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి, ఏలూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయానికి అందజేస్తారని తెలిపారు. సెక్టార్ అధికారులు ఈనెల 18వ తేదీ నుంచి 20 వతేదీ వరకు మరల తనిఖీ చేసి హోం ఓటర్ జాబితా తయారు చేస్తారన్నారు. ఆ జాబితాలో ఉన్నవారికి నిర్ణీత తేదీల్లో ప్రత్యేక బృందాల ద్వారా హోం ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. హోం ఓటింగ్‌కు అర్హత కలిగిన ఓటర్లు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.



ఎంపికైన బాలుర, బాలికల జట్ల క్రీడాకారులు

బాస్కెట్‌బాల్ పోటీలకు జట్ల ఎంపిక

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 14 : నూజివీడులో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు జరిగే 9వ అంతర్‌జిల్లాల బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాలబాలికల జట్లను ఏలూరులో ఎంపికపోటీలు నిర్వహించామని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జి.కృష్ణారెడ్డి, గవ్వా శ్రీనివాసరావు తెలిపారు. జూనియర్ బాలుర జట్టులో సీహెచ్ ధోని, ఎస్.కిషోర్, ఎ.ఈశ్వర్‌తేజ, ఎన్.సందీప్, సీహెచ్ తేజసత్యనారాయణ, ఎం.సోమశేఖర్, వి.తేజ, మణీంద్ర, ఎం.సాంబసూర్య, ఎస్.జాన కీరామ్, డి.భరత్, వి.భానుప్రకాష్, ఎన్.ప్రభుకుమార్, స్టాండ్‌బైగా వి.చార్లెస్‌వెస్లీ, ఎ.ఎం.కె రామ్‌శెట్టి, జి.వరప్రసాద్, ఎస్‌కే జాఫర్, జూనియర్ బాలికల జట్టులో పి. నాగవినయ్‌శ్రీ, డి.పావనిప్రియ, ఎ.పూర్ణచంద్రిక, వై.యామిని, పి.నందిని, పి.జయశ్రీ, ఎ.రుత్విక, జి.పూజిత, డి.సాయిభవాని, ఎ.జయశ్రీ, పి.రాణి, సి.కీర్తి, స్టాండ్‌బైగా డి.అమృత, జి.ఏసమ్మ, బి.అమృతవర్షిణి, టి.జోషికలను ఎంపిక చేశామన్నారు.

సోషల్ మీడియాలో కథనాలపై ప్రత్యేక దృష్టి

» పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



భీమవరం: ఏప్రిల్ 14 : సార్వత్రిక ఎన్నికల సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్టులో భాగంగా సోషల్ మీడియాలో ప్రసారమయ్యే కథనాలపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షిస్తోందని జిల్లా ఎన్నికల అధికారి, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాను సారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), లా అండ్ ఆర్డర్, ఎన్నికల సమగ్రత, ఎన్నికల ప్రణాళిక, నిర్వహణ తదితర అంశాలపై నకిలీ కథనాల ప్రచురణ, ప్రసారాన్ని ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడంగా పరిగణించబడుతుందని తెలిపారు. ద్వేషపూరిత ప్రసంగం, తప్పుడు సమాచారం, నకిలీ వార్తలు మొదలైన సందేశాలు సోషల్ మీడియాలో ప్రసారమైతే అలాంటి వాటిని చట్టవ్యతిరేకమైన సందేశాలుగా గుర్తించి సంబంధిత సందేశాలను పోస్టు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి సందేశాలు.. ఎలాంటి చట్ట వ్యతిరేకతకు దారితీస్తాయి, అందుకు కారకులైన వారికి చట్టపరంగా ఏయే సెక్షన్లు వర్తిస్తాయి? అనేది గుర్తించి జైలుశిక్ష లేదా జరిమానా లేదా రెండింటిని అమలు చేస్తామన్నారు.

ముగిసిన టెక్‌జెట్-24



టెక్‌జెట్‌లో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నూజివీడు, ఏప్రిల్ 14: ఆర్జీయూకేటీ పరిధిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టెక్‌జెట్-24 టెక్నో మేనేజ్‌మెంట్ ఎక్స్‌పో ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పీయూసీ విభాగం నుంచి 35 మంది విద్యార్థులు మెటావర్స్ ఆర్ట్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ విభాగాల నుంచి పలు సాంకేతిక ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శనకు ఉంచారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ గోపాలరాజు, సెంట్రల్ డీన్ శ్రావణి, ఏవో టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



ఆకివీడులో అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభిస్తున్న డెంటల్ వైద్యుడు కిరణ్

పాలకొల్లుఅర్బన్, ఏప్రిల్ 14 : అగ్నిమాపకవారోత్సవాల సందర్భంగా స్థానిక ఫైర్ స్టేషన్ వద్ద సహాయజిల్లా అగ్నిమాపక అధికారి వైవీ జానకీరామ్ పర్యవేక్షణలో ఆదివారం ఉదయం సిబ్బంది పరేడ్ చేసి, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళులర్పించారు. అనంతరం ఫైర్ కార్‌తో ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అగ్ని ప్రమాదాలు నివారణపై ముద్రించిన కరపత్రాలను పట్టణంలో ప్రజలకు పంపిణీ చేశారు.

● నరసాపురం టౌన్: ప్రజల్లో అగ్ని ప్రమాదాల నివారణ, ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించినప్పుడే ప్రమాదాలు నివారించవచ్చని అగ్నిమాపక అధికారి భాస్కరరామ్ అన్నారు. ఆదివారం పట్టణ ఫైర్ కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. సిబ్బందితో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఈనెల 20 వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా ప్రజల్లో ప్రమాదాల నివారణపై చైతన్యపర్చాలని పిలుపునిచ్చారు.

● ఆకివీడు : అగ్ని ప్రమాదాలు పట్ల ప్రతీ ఒక్కరూ చైతన్యవంతులు కావాలని సూర్య హాస్పటల్ అధినేత కనుమూరి కిరణ్ అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అగ్నిప్రమాదాలు నివారించి దేశప్రగతికి తోడ్పడాలన్నారు.కార్యక్రమంలో అగ్నిమాపకశాఖాధికారి నాగేశ్వరరావు సిబ్బంది ఉన్నారు.


నేటి నుంచి సీతారామస్వామి కల్యాణోత్సవాలు



కలిదిండి, ఏప్రిల్ 14 : అపర భద్రాద్రి తాడినాడరామాలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు ఈనెల 15 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 17న ఆలయ చైర్మన్ అల్లూరి శివాజీ దంపతులు కల్యాణం నిర్వహిస్తారన్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఉత్సవాల్లో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ ప్రియకుమార్ తెలిపారు.



14-04-2024 పొగాకు ధరలు (రూ.)	పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
	దేవరపల్లి	243	225	235.60
	జంగారెడ్డిగూడెం-1	244	235	240.40
	జంగారెడ్డిగూడెం-2	243	235	239.99
	కొయ్యలగూడెం	244	235	240.56
	గోపాలపురం	245	235	239.88



పోలవరంలో సమస్యల తిష్ఠ

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందాన మండల కేంద్రమైన పోలవరం పరిస్థితి మారింది. పోలవరంలో ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుంది, పర్యాటకం అభివృద్ధి చెంది పదిమందికి ఉపాధి దొరుకుతుందని ఆశించిన పోలవరం ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణం పేరిట 23 గ్రామాల్లోని సుమారు మూడు వేల మందికి పైగా నిర్వాసిత కుటుంబాలను ఇతర మండలాలకు తరలించారు. ఈ మేరకు మండల జనాభా తగ్గి వ్యాపారాలు, సాగు భూముల విస్తీర్ణం తగ్గి ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.

అభివృద్ధికి ఆమడ దూరం..

» పునరావాసం పేరుతో జనాభా తరలింపు..

» సాగు భూముల విస్తీర్ణం తగ్గి దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ

» మూతపడే స్థాయికి పట్టిసీమ ఎత్తిపోతల పథకం

- పోలవరం

జిల్లాల ఏర్పాటు అనంతరం నియోజకవర్గ కేంద్రంగా నిత్యం జనసమూహంతో ఉండే పోలవరం బోసి పోయింది. ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు సైతం పక్క మండలాలకు తరలిపోవడంతో ప్రజాప్రతినిధులు, అధికారులకు పోలవరం మండలంపై శ్రద్ధ తగ్గి పూర్తిస్థాయిలో అభివృద్ధి కుంటుపడింది. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో పోలవరంలో ఏర్పాటు కావాల్సిన వంద పడకల మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, డిగ్రీ కళాశాల పక్క మండలాలకు తరలించడం పట్ల ప్రజలు అసంతృప్తి జ్వాలలతో రగిలిపోతున్నారు. నియోజకవర్గ కేంద్రంగా నామినేషన్ల ప్రక్రియ పోలవరంలో కొనసాగే విధానాన్ని మార్చి ఐటీడీఏ వద్ద ఏర్పాటు చేయడం పట్ల పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.

నెక్లెస్ బండ్ ఇక్కట్లు

పోలవరం గ్రామానికి రక్షణగా 2009లో నిర్మించిన నెక్లెస్ బండ్ అరకొరగా నిర్మించి వదిలేయడం వల్ల వరదల సమయాలలో మండల కేంద్రంలో సగానికిపైగా జనాభా ప్రాణాలు గుప్పిట పెట్టుకుని జీవించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వరదల సమయంలో ఆర్భాటం చేసి ఇసుక బస్తాలు వేసి వెళ్లిపోయే అధికారులు, ప్రజా ప్రతినిధులు సాధారణ రోజుల్లో నెక్లెస్ బండ్ పునరుద్ధరణ గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. నెక్లెస్ బండ్ నిర్మాణం వల్ల మృతదేహాల దహనాలకు శ్మశానమే లేక మృతుడి బంధువులు వేగేశ్వరపురం, కొవ్వూరు ప్రాంతాలకు వాహనాలపై తరలించాల్సిన పరిస్థితులు వచ్చాయి. గత 15 ఏళ్లుగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా ప్రజాప్రతి నిధులు, జిల్లా అధికారులు, రాష్ట్ర ముఖ్యమంత్రికి సైతం మొరపెట్టుకున్నా శ్మశానం లేని దుస్థితి తలెత్తిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెక్లెస్ బండ్‌కి పొడవునా మేజర్ డ్రెయిన్ నిర్మించకపోవడం వల్ల గ్రామం నీటమునిగి చెరువుని తలపిస్తుందని డ్రెయినేజీలు నిర్మించాలని ప్రజలు కోరినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నెక్లెస్ బండ్

నిలిచిన పోలవరం ప్రాజెక్టు పనులు

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే బాగుంటుందని భావించిన స్థానిక ప్రజల ఆశలు కూడా ప్రాజెక్టు నిర్మాణం అర్ధంతరంగా నిలిచిపోవడంతో ఆశలు సన్నగిల్లాయి. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా సాగు, తాగునీరు అంది మండలంలోనే గాక రాయలసీమ వరకు లక్షల ఎకరాలకు నీరంది వ్యవసా యాలు మూడు పంటలుగా వర్ధిల్లేది కాస్తా పట్టిసీమను ప్రభుత్వం పడకే యించింది. పంటలకు సాగునీరు లేక రైతులు పంట విరామం పాటించే పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు ఆశించిన స్థాయిలో లేక గోదావరిలో నీరు కరువై స్థానిక పంపింగ్ స్కీంలు నీరు లేక మూతపడే స్థాయికి చేరుకుని చేతి కందే పంటలు ఎండిపోయి రైతులు నష్టపోయే పరిస్థితులు ఎదురయ్యాయి.

ప్రత్యేక జిల్లా వచ్చేనా ?

పోలవరం ప్రాజెక్టు నిర్మాణానంతరం ప్రాజెక్టు ఎగువ 23 గిరిజన గ్రామాలు ఇతర మండలాలకు తరలిపోవడం, మండలంలో జనాభా తగ్గి వర్తక, వ్యాపారాలు లేక ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడంతో పోలవరాన్ని ప్రత్యేక జిల్లాగా జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని ప్రజానీకం కోరుతున్నారు. పోలవరం జిల్లా సాధన కమిటీలు గత కొన్ని రోజులుగా మహాసభలు నిర్వహించి ప్రత్యేక జిల్లా కేంద్రం సాధనపోరాటం కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. రెండు నెలల క్రితం ఏజెన్సీ గిరిజన మండలాల ప్రజలు ఏడు వేల మందితో పోలవరంలో స్థానిక ఏటిగట్టు సెంటర్ పోలవరం ప్రాజెక్టు ముఖద్వారం వద్ద మహాసభ నిర్వహించారు. ఆ సభలో పోలవరం ప్రాజెక్టు పూర్తయితే పర్యాటకంగా అభివృద్ధి జరుగుతుందని చర్చించి జిల్లా కేంద్రం ఏర్పాటు కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలను, ప్రజా సంఘాలను పిలిచి విన్నవించారు. ఎన్నికల హామీలలో సైతం అధికార, ప్రతిపక్షాలకు చెందిన పలువురు నేతలు హామీలు ఇచ్చారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడి ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల అనంతరం రానున్న ప్రభుత్వ పాలనలో పోలవరం జిల్లా, జిల్లా కేంద్రం ఆశలు నెరవేరేనా లేదా అనే విషయంలో వేచి చూడాల్సిందే.

అత్యంత కట్టుదిట్టంగా ఈవీఎంల తరలింపు

» జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేశ్



కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీకి చేరుకున్న ఈవీఎంలు

ఏలూరుసిటీ, ఏప్రిల్ 14: ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లోని ఈవీఎం గొడౌన్‌లో నిర్వహిస్తున్న ఈవీఎంల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వై.ప్రసన్నవెంకటేశ్ ఆదివారం పరిశీలించారు. మొదటి ర్యాండమైజే షన్ ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గత శుక్రవారం నిర్వహించి పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా పూర్తి చేశారు. దీనికి అనుగుణంగా శనివారం ఉదయం నుంచి స్థానిక ఈవీఎం గొడౌన్ వద్ద బీయూలు, సీయూలు, వీవీ ప్యాట్‌లను వరుసగా 120, 120, 130 దామాషాగా విభజించటం జరిగింది. ఏడు నియోజకవర్గాలు కలిపి పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజకవర్గాలకు మొత్తం బీయూలు 4,184, సీయూలు 4,184, వీవీ ప్యాట్స్ 4,534 తరలిస్తున్నారు. వీటిని జీపీఎస్ అమర్చిన టీబీటీ క్లోజ్డ్ వాహనాలలో పోలీస్ ఎస్కార్ట్‌తో పార్లమెంట్ అసెంబ్లీ సెగ్మెంట్స్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వేర్వేరు స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచేందుకు అత్యంత కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య తరలించారు. ఇప్పటివరకు చింతలపూడి, పోలవరం, నూజివీడు, ఏలూరు, దెందులూరు, కైకలూరు నియోజకవర్గాలకు సంబంధించి ప్రక్రియ పూర్త యింది. నామినేషన్ల స్క్రూటినీ అనంతరం కమిషనింగ్ (ఈవీఎంలలో బ్యాలెట్ పేపర్ ఫిక్స్) చేయడం జరుగుతుంది. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీలు వేసి మళ్లీ భద్రపరుస్తాం. చివరిగా రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించి పోలింగ్ స్టేషన్లు వారీగా తరలిస్తాం. పరిశీలన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, డీఆర్వో డి.పుష్పమణి, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, ఈవీఎం నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ ఏవో కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఐటీడీఏకు చేరుకున్న ఈవీఎంలు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 14 : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలో జరగబోయే అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన ఈవీఎంలు ఆదివారం కేఆర్ పురం ఐటీడీఏకు వచ్చినట్టు ఐటీడీఏ పీవో, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ తెలిపారు. బ్యాలెట్ యూనిట్స్ 340, కంట్రోల్ యూనిట్స్ 340, వీవీ ప్యాట్స్ 360 వచ్చాయన్నారు. ఆమోదం పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల నాయకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టి సీలు వేశామన్నారు. సెంట్రల్ కమాండ్ ఫోర్స్, సీసీ కెమెరాలతో స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత ఏర్పాటు చేశామని ఐటీడీఏ కార్యాలయం వైటీసీ కాంప్లెక్స్‌లో భద్రపరచినట్టు తెలిపారు.



బాదంపూడి ఊరు మధ్యలో ఉన్న రైల్వే గేటు మూసిన దృశ్యం

16 వరకు రైల్వే గేటు మూసివేత

» బాదంపూడి వాసులకు తప్పని ఇబ్బందులు

ఉంగుటూరు, ఏప్రిల్ 14 : బాదంపూడి వద్ద రైల్వే గేటు ఊరి మధ్యలో ఉండడంతో సహజంగానే గ్రామస్థులు ఇబ్బందులు పడుతూనే ఉంటారు. ఈ గేటు మీదుగా నిత్యం వెల్లమిల్లి, బాదంపూడి గ్రామస్థులు హైవేకి వెళ్లాల్సి రావడంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వీటితో పాటు మరమ్మతుల పేరుతో గేటు మూసివేయడంతో మరిన్ని ఇబ్బందులు గ్రామస్థులకు తప్పడం లేదు. మరోవైపు మరమ్మతులు పూర్తికాలేదని రోజులు పెంచుకుంటూ వెళ్లడంతో వారి బాధలు వర్ణనాతీతం. రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం బాదంపూడి రైల్వే గేటును తొలుత ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు మూసివేశారు. మరమ్మతులు పూర్తి కాకపోవడంతో 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు పెంచగా ప్రస్తుతం ఈ పనులు కూడా పూర్తి కాకపోవడంతో మరోసారి ఈనెల 15వ తేదీ ఉదయం 7 గంటల నుంచి, 16వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గడువు పెంచుతున్నామని తాడేపల్లిగూడెం సీనియర్ సెక్షన్ అధికారి ఎ.రవి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మొత్తం 13 రోజుల పాటు మరమ్మతులు జరపడంతో ఆయా గ్రామస్థులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ సీజన్ కావడంతో రైతులు, పశువుల కాపరులు అవస్థలు వర్ణనాతీతం.

పూజల ఫలితమే అయోధ్య రామమందిర నిర్మాణం

» బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి చౌదరి

» యాజ్ఞవల్క్య రాజాశ్రమంలో అఖిల భారత మహాసభలు ప్రారంభం



అఖిల భారత మహాసభలో మాట్లాడుతున్న తపనా చౌదరి

పెదవేగి, ఏప్రిల్ 14 : లక్షలాదిమంది ప్రజల ప్రాణత్యాగం, ఎంతోమంది పూజల ఫలితమే అయోధ్య రామమందిర నిర్మాణమని తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి(చౌదరి) అన్నారు. పెదవేగి మండలం ముండూరులోని యాజ్ఞవల్క్య రాజాశ్రమం 66వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన మూడు రోజులపాటు జరిగే వేదాంత మహాసభలను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ఐదు వందల ఏళ్ల పోరాటం, వందేళ్ల న్యాయ పోరాటం, సాధు సంతులు చేసిన తపస్సు వెరసి.. అయోధ్య రామమందిర నిర్మాణమన్నారు. అయోధ్యలో భవ్యమైన, దివ్యమైన రామమందిర నిర్మాణం కారణజన్ముడైన ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ప్రారంభమైందని పేర్కొన్నారు. బాలరాముని విగ్రహ ప్రతిష్ఠతో అయోధ్య పునీతమైందని, అంతటి మహద్భాగ్యం కలుగడం మనందరి పుణ్యఫలమన్నారు. యాజ్ఞవల్క్య రాజాశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానందభారతి స్వామి మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ వేదాంత మహాసభల్లో పలు ప్రాంతాలనుంచి వచ్చిన అఖండ జ్ఞానులు, పీఠాధిపతులు, ఆశ్రమాధిపతులు వేదాల సారాన్ని వినిపిస్తారని వివరించారు. తొలుత ప్రణవ పతాకావిష్కరణతో వేదాంత మహాసభలను గారపాటి చౌదరి ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన ఏలూరు ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు, ఆశ్రమ స్వాములు ప్రణవానంద భారతిస్వామి, చిత్స్వరూపానందగిరి స్వామి, శంకరానందగిరి స్వామి, సత్యానందగిరి స్వామి, శ్రీమాతా శివానందగిరి స్వామి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

అంబేడ్కర్ రాజ్యాంగం ప్రపంచానికే స్ఫూర్తి

» ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ వీరేష్‌కుమార్

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 14 : డాక్టర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచానికే స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఏపీ నిట్ డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ జీబీ. వీరేష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఏపీ నిట్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ సమాజానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. ఎస్సీ, ఎస్టీ సెల్ లైజన్ ఆఫీసర్ డాక్టర్ వినోత్‌కుమార్‌రాజా మాట్లాడుతూ భారతదేశం గర్వించతగ్గ మహోన్నత వ్యక్తులలో అంబేడ్కర్ ఒకరని కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ తపస్, డాక్టర్ రాముడు, డాక్టర్ భరణీధరన్, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ తలారిరేష్మ, డాక్టర్ సీహెచ్.శ్రీలత, డాక్టర్ సుదర్శన్ దీప పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీలో అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న వీసీ

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 14: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ బి. శ్రీనివాసులు వర్సిటీ అధికారులు, సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.



తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అందుకుంటున్న విద్యార్థులు

'గురుకుల పాఠశాల'కు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 14: తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గురుకుల పాఠశాలకు ఆదివారం రెండు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ సొంతం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. అంబేడ్కర్ జయంతి మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులు తమ పాఠాలు తామే బోధించుకునే విధంగా వీడియోలు తీసి వారి తల్లిదండ్రులకు పంపించడంలో 3,600 ప్రాజెక్టులు చేసినట్టు వివరించారు. ఈ అంశంలో ఒక తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌తోపాటు, 500 మంది విద్యార్థులు అంబేడ్కర్ చిత్రపటాలు వేయడం ద్వారా మరో రికార్డు సాధించారని వివరించారు. సంబంధిత పత్రాలను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అబ్జర్వర్ పి.శ్రీనివాస్ అందించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

18న వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా ?

పెదపాడు, ఏప్రిల్ 14 : మళ్లీ అధికారంలోకి రాగానే వలంటీర్ల దస్త్రంపైనే తొలి సంతకమని సీఎం జగన్ తెలిపినా.. రానున్న టీడీపీ ప్రభుత్వంలో వలంటీర్లకు తగిన గుర్తింపునివ్వడంతో పాటుగా ప్రస్తుతం అందుతున్న రూ.5 వేల వేతనానికి బదులుగా రూ.10 వేల వేతనం అందిస్తామని మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెబుతున్నా.. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ కొన్ని గ్రామాల పరిధిలోని కొంతమంది వలంటీర్లు రాజీనామాల బాట పడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో పెదపాడు మండల పరిధిలో వలంటీర్లుగా విధులు నిర్వహిస్తున్న సుమారు 400 మంది వలంటీర్ల పయనమెటనేది ప్రశ్నగా మిగిలింది. ఇటీవల పెదపాడులో జరిగిన వైసీపీ మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఈనెల 18న వలంటీర్లు రాజీనామాలు చేస్తామంటున్నారు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు రాజీనామా చేసిన వలంటీర్లందరిని ఈనెల 19న జరిగే నామినేషన్ ప్రక్రియలో పాల్గొనేలా చూడాలంటూ సూచించడంతో రాజీనామా అంశం మరోమారు తెరపైకి వచ్చింది. ఈక్రమంలో రాజీనామా చేయాలా.. వద్దా, భవిష్యత్తు ఏమిటనే దానిపై కొందరు వలంటీర్లు ఆలోచనలో పడ్డారు. మొత్తంమీద ఎంతమంది వలంటీర్ల రాజీనామాలు సమర్పించనున్నారనేది మరో మూడు రోజుల్లో స్పష్టం కానుంది.

వాహనాల తనిఖీల్లో అప్రమత్తంగా ఉండాలి



తాటియాకులగూడెం చెక్‌పోస్టు వద్ద అసిస్టెంట్ కమిషనర్ విజయ, సీఐ, ఎస్‌ఐలు

జీలుగుమిల్లి, ఏప్రిల్ 14:రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది వాహనాల తనిఖీల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ అన్నారు. జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెం వద్ద చెక్‌పోస్టును ఆమె పరిశీ లించారు. అక్రమంగా వాహనాల్లో ఇతర రాష్ట్రాల మద్యం, ఇతర ఎన్నికల సామగ్రి తరలిపోకుండా తనిఖీలు ఉండాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇతర రాష్ట్రాల మద్యం ఒక బాటిల్ ఉన్నా శిక్షకు అర్హుల వుతారన్నారు. జంగారెడ్డిగూడెం ఎస్‌ఈబీ సీఐ పట్టాభి చౌదరి, ఎస్‌ఐలు కె.శేఖర్‌బాబు, జె.ఎలియాజర్, హెడ్‌కానిస్టేబుల్ సీతారాం, ఏఆర్ సిబ్బంది ఉన్నారు.

చింతలపూడి ఎస్‌ఈబీ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

చింతలపూడి, ఏప్రిల్ 14:చింతలపూడి ఎస్‌ఈబీ స్టేషన్‌ను ఎస్‌ఈబీ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులలో నమోదు చేసిన కేసుల వివరాలను సమీక్షించారు. సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, అక్కడ నమోదైన కేసులను పరిష్కరించారు. స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.ఎస్.ఎస్.వి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం సమాచారం

పెళ్లి శుభలేఖలు ఇచ్చేందుకు వెళుతూ..

» మోటారు సైకిల్‌ను ఢీకొట్టిన ఆటో.. ఒకరి మృతి



సతీష్‌కుమార్ మృతదేహం

పాలకొల్లు రూరల్, ఏప్రిల్ 14 : నరసాపురం రోడ్డులో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. వివరాలివి.. నరసాపురం శ్రీహరిపేటకు చెందిన మురపాక సతీష్‌కుమార్(37) నరసాపురం నుంచి బంధువుల ఇంట్లో జరిగే పెళ్లి శుభలేఖలు ఇచ్చేందుకు పోడూరు మండ లం జగన్నాథపురానికి మోటారుసైకిల్‌పై వెళుతున్నాడు. దిగమర్రు దాటిన తరువాత రైస్ మిల్లు సమీపంలో ఆటో ఢీకొట్టడంతో అక్కడికక్కడే కిందపడి మరణించాడు. భార్య సన్యాసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ డి.హరికృష్ణ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం

తణుకు, ఏప్రిల్ 14: తణుకు పట్టణంలోని సంత మార్కెట్ వద్ద గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో మహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ పూజలు ఘనంగా జరిగాయి. ఆదివారం పట్టణానికి చెందిన పొన్నపల్లి శ్రీరామకృష్ణ శర్మ, రాజ్యలక్ష్మి, పొన్నపల్లి బాలసాయి విశ్వనాథ్, లిఖిత దంపతులు పూజలు చేశారు. సోమవారం ఉదయం 11.15 గంటలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నసమారాధన జరగనుంది. పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు పొడుగు రామాచారి, ఆలయ చైర్మన్ కొమ్మోజు రామకృష్ణ, ప్రధాన అర్చకులు కడియం అప్పలాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



శివపురంలో బీసీ సదస్సులో మాట్లాడుతున్న రోషన్‌కుమార్

బీసీల పక్షపాతి తెలుగుదేశం : రోషన్

చింతలపూడి, ఏప్రిల్ 14: తెలుగుదేశం పార్టీ బీసీల పక్షపాతి అని సొంగా రోషన్ కు మార్ అన్నారు. మండలంలోరి శివపురంలో ఆదివారం జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు బీసీ డిక్లరేషన్ రూపొందించి 50 ఏళ్లకే పింఛన్, బీసీ రక్షణ చట్టం చేస్తారన్నారు. అంతకు ముందు ప్రచార ర్యాలీలో మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, పిల్లల విద్యకు రూ.15 వేలు ఆర్థికసహాయం, రైతులకు రూ.20వేలు సహాయం, నిరుద్యోగ భృతితో కూడిన సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. జె.ముత్తారెడ్డి, మాటూరి వెంకటరామయ్య, గుత్తా వెంకటేశ్వరరావు, చీకటి రాజేంద్రకపూర్, చీకటి రమేష్, అంకమరావు, చిన్నం వెంకటేశ్వరరావు, కొమరరాజు సత్యనారాయణ, మిద్దె సత్యనారాయణ, బోడా అనిష్‌కుమార్ కార్యకర్తలు పాల్గొన్నారు.



రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి, ఏప్రిల్ 14: రాట్నాలకుంట రాట్నాలమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. అమ్మవారికి పాలపొంగలిని నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి సత్యనారాయణ శర్మ, రుద్రపాక శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి అమ్మవారికి లలితా సహస్రనామ దేవీ ఖడ్గమాలార్చన పూజలు నిర్వహించారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.51,570, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.32,250, ఫోటో విక్రయాల ద్వారా రూ.5550 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు రూ.10,600 విరాళాలు అందించారని ఆయన చెప్పారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఏర్పాట్లు చేశామని ఈవో సతీష్‌కుమార్ తెలిపారు.

ఆయుష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14: ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం దెందులూరు ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 450 మందిని వైద్యులు పరీక్షించినట్లు ఆస్పత్రి మేనేజర్ కాశీనాథ్ జాస్తి తెలిపారు. ఫైబ్రోస్కాన్ పరీక్షలు, ఈసీజీ, బీపీ, మధుమేహం పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు వివరించారు. హోమ్లీ ఫుడ్‌వల్ల ఆరోగ్యం, జంక్ ఫుడ్‌వల్ల అనర్థాలు, లివర్ సంబంధిత రోగాలు తదితర అంశాలపై రోగులకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. వైద్య సేవలందించినవారిలో గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు డాక్టర్ డి.వెంకట జయదీప్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ భానుకిరణ్, డాక్టర్ భవాని తదితరులున్నారు.

గౌడ సంఘీయులు ఐక్యంగా ముందుకు సాగాలి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 14: గౌడ సంఘీయులు ఐక్యంగా ముందుకు సాగాలని టీటీడీ పాలక మండలి సభ్యుడు మేకా శేషుబాబు పిలుపునిచ్చారు. ఆలపాటి గంగాభవానీ కళ్యాణ మండపంలో చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల గౌడ ఆత్మీయ సమ్మేళనం జిల్లా అధ్యక్షుడు అయినాల వెంకట రమణమూర్తి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. శేషుబాబు మాట్లాడుతూ ఐక్యంగా ఉంటూ రాజ్యాధికారం తెచ్చుకునే విధంగా పోరాటం చేయాలన్నారు. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా బలపడాలని పిలుపునిచ్చారు. ఐఆర్ఎస్ అధికారి రవిశంకర నారాయణ మాట్లాడుతూ గౌడ సంఘీయుల్లో యువతకు విద్య ఉపాధి రంగాల్లో గుర్తింపు ప్రోత్సాహం లేదన్నారు. గౌడ యువత విద్య, ఉపాధి రంగాల్లో ముందుకు సాగలేకపోతున్నారన్నారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ గౌడ్ మాట్లాడుతూ గౌడ సంఘీయులంతా ఐక్యంగా ఉండాలన్నారు. ఆయా పార్టీలు సంఘీయులకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. మిడతా పెంటయ్య గౌడ్, పీపీఎస్ చంద్రరావు, తల్లాడి నేతాజీ శ్రీనివాస్, చింత అనిల్‌గౌడ్, ఈడా సూర్యచంద్ర శ్రీనివాస్, మట్టా సత్తిపండు, తల్లాడి సంజయ్, మేకా శశికళ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తాం : బడేటి చంటి



ప్రజా చైతన్య యాత్రలో చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 14: రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, ప్రజలంతా భాగస్వాములు కావాలని ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి పిలుపునిచ్చారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా 49, 44, 45, 6 డివిజన్స్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం తథ్యమన్నారు. అధికారంలోకి రాగానే ప్రజా సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు. అక్రమార్జన, దందాలు, దాడులతోనే ఐదేళ్ల పాలనను జగన్ దుర్వినియోగం చేశాడని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబు, పవన్ కల్యాణ్ తోనే సాధ్యమన్నారు. సంకల్పయాత్రలో ప్రజాస్పందన విశేషంగా ఉందన్నారు. వైసీపీ చేసే కుట్రలు ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉండాలన్నారు. 6, 3, 1 డివిజన్లలో వందలాదిగా వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, కాశీనరేష్, మల్లెపు రాము, నాని, ఎం.రమేష్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిపై దాడికి డీజీపీ బాధ్యత వహించాలి



వేగవరం జయహో బీసీ సభలో నేతలు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 14: ముఖ్యమంత్రి జగన్‌పై రాయితో దాడి హత్యాయత్నమే అయితే డీజీపీ బాధ్యత వహించాలని, సీబీఐ విచారణ జరిపించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేష అన్నారు. వేగవరంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో బీసీసెల్ అధ్యక్షుడు బుసా సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. దాసరి శేష మాట్లాడుతూ గతంలో ఇదేవిధంగా చంద్రబాబు, లోకేశ్‌పై దాడి జరిగితే మంత్రులే వంకర వ్యాఖ్యలు చేస్తూ కేవలం బెయిలబుల్ కేసులు పెట్టారని గుర్తు చేశారు. బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, ఆలపాటి రాము, చేను ప్రసాద్, కొంచాడ ప్రసాద్, గంట శ్రీను, ముళ్ళపూడి శ్రీను, పేంట్ సాహెబ్, రమణ, సనపతి అప్పలనాయుడు, ఒరుగంటి శ్రీను, నడిపూడి శ్రీను, గొల్లమందల శ్రీనివాస్, పాల్గొన్నారు.

మాధవరంలో కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు పర్యటన

వేలేరుపాడు, ఏప్రిల్ 14 : కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు మండలంలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆదివారం మేడేపల్లి, కమ్మరిగూడెం, మాధవరం, రామవరం, రుద్రమకోట, రేపాకగొమ్ము గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. అనంతరం భూదేవిపేట గ్రామంలో జనసేన పార్టీ నాయకులు కరాటం రాంబాబు, కరాటం సాయితో కలసి విలేకర్లతో మాట్లాడారు. నిర్వాసితులకు అన్ని విధాలా న్యాయం చేయగల్గుతామని కరాటం రాంబాబు పేర్కొన్నారు.

ఉమ్మడి అభ్యర్థి తీరుపై టీడీపీ అసంతృప్తి

బుట్టాయగూడెం, ఏప్రిల్ 14: పోలవరం తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు తీరుపై టీడీపీ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి అభ్యర్థి విజయానికి తామంతా ఏకమై పనిచేస్తామని తమను కూడా పర్యటనల్లో భాగంగా సమాచారం ఇవ్వాలని కోరినా సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బుట్టాయగూడెంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని నాయకులకు, మండల పార్టీ అధ్య క్షులకు పిలుపు ఉండడం లేదన్నారు. అభ్యర్థికి బి.ఫారమ్ వచ్చేవరకు బొరగం శ్రీనివాస్‌కు సీటు కోసం పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. శీలం వెంకటేశ్వరావు, పారేపల్లి రామారావు, మొగపర్తి సోంబాబు, యంత్రప్రగడ శ్రీనివాసరావు, పి.నరేష్, సోమసుందరం మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదా : లావణ్య

జీలుగుమిల్లి: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తథ్యమని కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య, ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వెల సృజన అన్నారు. మండలంలో ఎన్నికల ప్రచారం చేసి తమను గెలిపించమని కోరారు. మహిళలకు ఏటా రూ.లక్ష, రైతు రుణమాఫీ, ఉపాధి కూలీ పెంపు హామీలు వివరించారు. ఎస్‌వి.అప్పారావు, సీహెచ్.కొండలరావు ఉన్నారు.

చింతమనేని సమక్షంలో టీడీపీలో చేరికలు



నవహర్షను అభినందిస్తున్న చింతమనేని

ఏలూరు రూరల్, ఏప్రిల్ 14: ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో చింతమనేని సమక్షంలో ఆదివారం పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మాదేపల్లికి చెందిన వైసీపీ నాయకుడు బాలి బోయిన నవహర్ష వైసీపీని వీడి టీడీపీలో చేరారు. నవహర్ష ఆధ్వర్యంలో దాదాపు 60 పైగా కుటుంబాలు టీడీపీలో చేరారు. దెందులూరు మండలానికి చెందిన టీడీపీ నాయకులు సంపెంగ తిలక్, కలపాల బుజ్జి, గారపాటి కొండయ్య, కొడారి వాసు, వై.వి.యార్, దాసే శ్రీను ఆధ్వర్యంలో దాదాపు 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పెదవేగి మండలంలోని కొప్పాక, అంకన్నగూడెం గ్రామాల నుంచి దాదాపు 15 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారందరికీ చింతమనేని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నంబూరి నాగరాజు, తాతా సత్యనారాయణ, నేతల రవి, పైడిపాటి శేఖర్, పెదపాడు మండల అధ్యక్షుడు లావేటి శ్రీనివాస్, ఎస్సీసెల్ అధ్యక్షులు కొర్రపాటి రఘు, సైదు సత్యనారాయణ, జనసేన నాయకులు మోటేపల్లి పవన్ నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని అందించేవి గ్రంథాలయాలు



పుస్తక పఠనంలో విద్యార్థులు

పెదవేగి, ఏప్రిల్ 14: తరచుగా గ్రంథాలయానికి వెళ్లి గ్రంథపఠనం చేస్తుంటే విజ్ఞాన సముపార్జనకు మార్గం ఏర్పడుతుందని లైబ్రేరియన్ తోట అరుణ్‌కుమార్ అన్నారు. పెదవేగి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం జరిగింది. పలువురు విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి, విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివారు. అరుణ్‌కుమార్ గ్రంథపఠనంతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా గ్రంథపఠనం చేయాలని, అదే వారి జీవితాన్ని ఉన్నతమైన దిశగా నడిపిస్తుందని ఆయన తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

భీమడోలు, ఏప్రిల్ 14: ఈ నెల 21 వరకూ నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాలను ఆదివారం మండలంలో ప్రారంభించారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం అధికారులు, సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి నాగరాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను సద్వినియోగపర్చుకోవాలని ఆయన అన్నారు. అగ్నిమాపక కేంద్రం పరిధిలో గత ఏడాది వివిధ ప్రమాదాల్లో 26,16,200 ఆస్తినష్టం జరుగగా, సరైన సమయానికి వెళ్ళి రూ.94.50 లక్షల ఆస్తిని నష్టపోకుండా కాపాడమని ఆయన తెలిపారు. పలువురు అగ్ని మాపక సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల్లో చట్టబద్ధమైన గ్రామసభలు

ఏలూరు కలెక్టరేట్, ఏప్రిల్ 14: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో అన్ని గ్రామపంచాయతీల్లో చట్టబద్ధమైన గ్రామసభలు నిర్వహించడం జరిగిందని, డీపీవో తూతిక శ్రీనివాసవిశ్వనాథ్ తెలిపారు. పంచాయతీల్లో ఆదివారం గ్రామ సభలు నిర్వహించి, గ్రామ అభివృద్ధి, ప్రణాళికలపై ప్రజలతో చర్చించాలని, నిధులు లభ్యత, గ్రామ అభివృద్ధిపై తీర్మానాలు చేయాలని సూచించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున గ్రామసభల్లో విధానపరమైన నిర్ణయాలు తీసుకోలేదని స్పష్టం చేశారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జయంతి వేడుకలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించినట్లు ఆయన తెలిపారు.

బీఎల్‌వో, సెక్టార్ అధికారులకు శిక్షణ

ఉంగుటూరు, ఏప్రిల్ 14: ఎన్నికల విధుల్లో భాగంగా ప్రతి ఓటును సద్వినియోగం చేసుకునేలా బీఎల్వోలు, సెక్టార్ అధికారులు ముందస్తు ప్రణాళిక వేసుకుని పకడ్బందిగా వ్యవహరించాలని ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఖాజావలి అన్నారు. ఆదివారం నాడు బూత్ లెవెల్, సెక్టార్ అధికారులకు పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌పై శిక్షణ నిర్వహించారు. ఆయన తో పాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తదితరులు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాలు వివరిస్తున్న చింతమనేని రాధారాణి

మహిళల ఆర్థికాభివృద్ధికి సూపర్ సిక్స్ పథకాలు

పెదవేగి, ఏప్రిల్ 14: మహిళల ఆర్థికాభివృద్ధికి టీడీపీ ఆరు పథకాలను తీసుకొచ్చిందని చింతమనేని వెంకట రాధారాణి అన్నారు. బాపిరాజుగూడెం రామచంద్రాపురంలో రాధారాణి ఆదివారం ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్నివర్గాలకు అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి పథాన పయనిస్తుందన్నారు. ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బొప్పన సుధాకర్, సర్పంచ్ జోగి పెద పెంటయ్య, ఎంపీటీసీ మద్దాల సహదేవుడు, తలకొండ జమలయ్య, జోగి సత్యవతి, పులిచర్ల రాధిక, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 14 : ఆర్యవైశ్యులు అన్ని రంగాలలో రాణించాలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామ సత్యనారాయణ అన్నారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం మహంకాళి రామ్మోహనరావు అధ్యక్షతన జరిగింది. చిన్ని రామ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షుడు రాకేష్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయాలలో రాణించాలని పిలుపునిచ్చారు. రాకేశ్ మాట్లాడుతూ మోసపూరిత రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఇటీవల జరి గిన కులగణనలో గుప్త, శెట్టి, కోమటి, వైశ్యులుగా ఆర్యవైశ్యులు నమోదు చేశారని, అసలైన ఆర్యవైశ్య పదాన్ని, కులగణనలో పెట్టకపోవడం ఆర్యవైశ్యులను తొక్కివేయడమేనన్నారు. నాలుగు విభాగాలలో ఆర్యవైశ్యులను కులగణనలో నమోదు చేయడం వల్ల ఆర్యవైశ్య జనాభా చీలిపోతుందని, తద్వారా రాష్ట్రంలో తక్కువ మంది ఆర్యవైశ్యులో ఉన్నారని, కుట్ర చేసే ప్రయత్నం చేస్తున్నారని, నిధులు లేకుండా పదవులు లేకుండా చేయడమే లక్ష్యంగా కులగణన జరిగిందని అన్నారు. ఆర్యవైశ్యులకు అండగా ఉండేది తెలుగుదేశం పార్టీ ఒకటేనని పేర్కొన్నారు. పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్ట మహేష్ కుమార్ యాదవ్, చింతలపూడి అభ్యర్థి సొంగా రోషన్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. రోషన్ కుమార్ మాట్లాడుతూ సేవ చేసే లక్ష్యంతో రాజకీయాలకు వచ్చినట్లు, ఆర్యవైశ్యులు రాజీకయంగా ఎదగాలన్నారు. అనంతరం రోషన్ కుమార్‌ను టీడీపీ నాయకులు గుళ్లపూడి రమేష్, శ్రీదేవి దంపతులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు రావూరికృష్ణ, మండవ లక్ష్మణరావు, రాజాన సత్యన్నారాయణ, పెనుమర్తి రామ్‌కుమార్, పరిమి సత్తిపండు, సాయిల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఉంగుటూరు, ఏప్రిల్ 14: ఉంగుటూరు భీమేశ్వరాలయ ఉపాలయమైన వేంకటేశ్వరాలయంలో వార్షిక కల్యాణోత్సవం శనివారం రాత్రి జరిగింది. ఆలయ కమిటీ తరపున చోడే నాని దంపతులు కూర్చుని స్వామి వారి కల్యాణాన్ని జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.



ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ నివాళి



కాట్లంపూడిలో మాట్లాడుతున్న కేజీబీవీ డైరెక్టర్



మాజీ ఎమ్మెల్సీ సూర్యారావుకు సత్కారం



రావికంపాడులో అంబేద్కర్ చిత్రపటం వద్ద స్కౌట్స్ గైడ్స్ నివాళి

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్

దార్శనికుడు

జయంతి కార్యక్రమాల్లో పలువురి నివాళి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 14: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కుడర్ దార్శనికుడని పలువురు వక్తలు అన్నారు. ఏలూరు బార్ అసోసియేషన్, ఎస్సీ ఎస్టీ న్యాయవాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. పీడీ ప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి జి రామ్‌గోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీనియర్ అడ్వకేట్ రొనాల్డ్‌రాజ్, ఎస్ఎంఎం నాగరాజు, రత్నరాజు, జి.తిరుపతిస్వామి, న్యాయవాదులు కలిసిపూడి రాజబాబు, మణికుమార్, పాల్గొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో బీఆర్ అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాల్, అడిషనల్ డైరెక్టర్ కేవీవీ.విజయ్‌కుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతి వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో జడ్పీ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. సాల్మన్, సాయిరాజు, జీ.వెంకటేశ్వరరావు, ధర్మలింగం, వెంకటరమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీలో ఎం.అశోక్‌కుమార్, నేతర అజయ్‌బాబు పాల్గొన్నారు. కొత్త బస్టాండ్ వద్ద నవ సమాజ్ సొసైటీ చైర్మన్ నేతల రమేష్‌బాబు ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీచేశారు. విన్నవల్లివారిపేట అంబేడ్కర్ విగ్రహం వద్ద నగర పాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి నివాళులర్పించారు. ఆర్ఆర్‌పేట పొన్నగంటి వారి వీధిలో జిజ్జవరపు ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. జగ్గారావు, కరుణ్, చందు, శ్రీను పాల్గొన్నారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జడ్పీ కార్యాలయ ప్రాంగణంలో విగ్రహానికి డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ బృందం పూలమాలలువేసి నివాళులర్పించారు. పేద విద్యార్థులకు స్వచ్ఛందంగా ఉచిత వసతి, చదువు చెప్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఆర్.సూర్యారావును సత్కరించారు. సంఘ నాయకులు ఎస్.అజాద్, ఎం.రాంబాబు, ఆర్.వెంకట రామ్మోహనరావు, అప్పారావు, గోపి, వీరబాబు, సందీప్, నాగేంద్రసింగ్ తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్: రాజ్యాంగ స్థాపనకు కృషిచేసిన అంబేడ్కర్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ఆళ్ళ నాని అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగరమేయర్ షేక్ నూర్జహాన్, ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఎస్సీసెల్ రాష్ట్రకార్యదర్శి జాన్‌గుర్నాథ్, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ చైర్మన్, టీచర్స్, ఆఫీసర్స్ జేఏసీ చైర్మన్ అంగులూరి సర్వేశ్వరరావు ఇంటిని పూలే అంబేడ్కర్ విజ్ఞానకేంద్రంగా తీర్చిదిద్దారు. బ్యాంకు పరీక్షలు గ్రూప్ -1, 2, పోటీపరీక్షలకు సంబంధించి పుస్తకాలను ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని కేజీబీవీ.డైరెక్టర్ దుక్కిపాటి మధుసూదన్‌రావు ప్రారంభించారు. మెప్మా పీడీ ఇమ్మానియేల్, పువ్వుల ఆంజనేయులు, పీఎంవో రవీంద్ర, డీవైఈవో కుటుంబరావు, ఎంఈవో రంగయ్య, బీటీఎస్ ఉపాధ్యాయసంఘం వెంకటేశ్వరరావు, గుగ్గులోతు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ముప్పినవారిగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ కాలనీ, రాజీవ్ కాలనీ, అరుంధతిపేట ప్రాంతాల్లో యువజన సంఘాల ఆధ్వర్యంలో జయంతి ఘనంగా జరిగింది. వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్ తెల్లం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

● పోలవరం: మండలంలో అంబేడ్కర్ విగ్రహాలకు దళిత నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలవరం అంబేడ్కర్ సెంటర్ విగ్రహం వద్ద సొబ్బన మోహన్, జైభీమ్ సైనిక్ సంఘం ఆధ్వర్యంలో డీఎస్పీ ఎన్ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ పవన్ కుమార్, అడ్వకేట్ సొబ్బన ఆనంద్, సొబ్బన రాజశేఖర్‌బాబు, బీరా విజయ్‌బాబు, యడ్లగూడెం సెంటర్, గూటాల కొండ్రు వీధి, ఎల్ఎన్‌డీ పేటలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు.

● కుక్కునూరు: లైబ్రరీ సెంటర్, సంజయ్‌నగర్ కాలనీ, సీతారామనగరం గ్రామాల్లో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. బొక్కా వెంకటేశ్వరరావు, రావు వినోద్, నరసింహరాజు, ములిశెట్టి నాగేశ్వరరావు, రాయి సత్యనారాయణ, బుడుగుల రవి, వెంకటేష్, చంటినాయుడు, పోతురాజు, కుమార్‌స్వామి, సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి, ఎం.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

● కామవరపుకోట: రావికంపాడు జడ్పీ హైస్కూల్‌లో స్కౌట్స్ విద్యార్థులు అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం ఉమ్మడి భీమరాజు. స్కౌట్ మాస్టార్ బిరుదుగడ్డ నాగేశ్వరరావు, సొంగా రమేష్, తదితరులు పాల్గొన్నారు. తడికలపూడి ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి ఎస్ఐ జయబాబు పూల మాల వేసి నివాళులర్పించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

● టి.నరసాపురం: మండలంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బొర్రంపాలెంలో పెండ్యాల అభిషేక్ బాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● వేలేరుపాడు: మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు మాచర్ల హరిబాబు, కార్యదర్శి బుడిపెటి జాన్‌బాబు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎండీ మున్నీరు, దుర్గారావు, జడ్పీటీసీ రామలక్ష్మి, తాట్కూరుగొమ్ము సర్పంచ్ ఉదయ్‌కిరణ్, మాచర్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నేతల నివాళి

పెదవేగి, ఏప్రిల్ 14: అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల్లో పలువురు నేతలు నివాళులర్పించారు. దుగ్గిరాల చింతమనేని ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగ రూపకర్తగా, పేదల, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఆయన సూచించిన మార్గం ఎప్పటికీ ఆదర్శనీయమన్నారు.

● ఏలూరు టూటౌన్: దేశానికి రాజ్యాంగాన్ని అందించి దిశా, నిర్దేశం చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని ఏలూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. దాసరి ఆంజనేయులు, మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో బడేటి చంటి నివాళులర్పించారు. జుంజు మోజేష్, తంగిరాల సురేష్, జాలా బాలాజీ పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో నగర అధ్యక్షులు పి.కిశోర్, ఐద్వా కార్యాలయంలో రమాదేవి ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

● ఉంగుటూరు: జనసేన కార్యాలయంలో జరిగిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమాల్లో పత్సమట్ల ధర్మరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రెడ్డి సూర్యచంద్రరావు, చింతల శ్రీనివాస్, యాళ్ల సుజీవరావు, తదితరులు పాల్గొన్నారు. నీలాద్రిపురంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పత్సమట్ల ధర్మరాజుతో ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్ నివాళులర్పించారు. దొంతవరం, ఉంగుటూరు, కైకరం, రావులపర్రు అంబేడ్కర్ విగ్రహాల వద్ద ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, మరడ వెంకట మంగారావు, మరడ రమావతి పాల్గొన్నారు.

● భీమడోలు: వడ్లపట్లలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, టీడీపీ శ్రేణులు, జనసేన నాయకులు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. పార్టీ నేతలు అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు. భీమడోలు గ్రామంలో పాము మాన్సింగ్ తదితర దళిత నేతల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. భీమడోలు అర్జావారిగూడెంలో సీఐటీయూ నాయకులు లింగరాజు దళిత నేతలు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

● కామవరపుకోట: బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి విజయం సాధిస్తేనే అం బేడ్కర్ రాజ్యాంగం సజావుగా అమలవుతుందని కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ అన్నారు. కొత్తూరులో అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొయ్యగూర స్వామినాథం, వలి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: అంబేడ్కర్ వల్లే బడుగు బలహీన వర్గాల మనుగడకు హక్కులు దక్కాయని జనసేన టీడీపీ బీజేపీ పోలవరం అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి చిర్రి బాలరాజు అన్నారు. జీలుగమిల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ సభ్యులు జై బీమ్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. గడ్డమణుగు రవికుమార్, పసుపులేటి రాము, తలారి సతీష్, జువ్వాల బాపూజీ, బొంతు రామారావు మాధవ్ పాల్గొన్నారు.

● చింతలపూడి: తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు జె.ముత్తారెడ్డి, బోడా నాగభూషణం తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. పక్కాల వెంకటేశ్వరరావు, మాటూరి వెంకటరామయ్య, అనీష్‌కుమార్, కె.రాజారెడ్డి, ధర్మరాజు, ఇనుమిల్లి రామారావు, మోహన్‌రావు, జనసేన నాయకులు ఏ.అప్పారావు, పలువురు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మండలంలో అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగారెడ్డిగూడెంలో కూటమి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ పూలమాల వేశారు. టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు యడ్లపల్లి ఏడుకొండలు, గొల్లమందల శ్రీనివాస్ ఆధ్వర్యంలో దాసరి శ్యామ్ చంద్ర శేషు, చిట్టిబొయిన రామలింగేశ్వరరావు, ఘంటా శ్రీను, మల్లిపూడి నవీన్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం కార్యాలయంలో ఎం.జీవర త్నం, ఎ.రవి, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.



ఉంగుటూరు జనసేన కార్యాలయంలో ధర్మరాజు నివాళి



వడ్లపట్ల అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో గన్ని



జీలుగుమిల్లిలో అంబేడ్కర్‌కు నివాళులర్పించిన చిర్రి బాలరాజు



చింతలపూడి టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నేతలు

జార్జిరెడ్డికి పీడీఎస్‌యూ నాయకుల నివాళి

ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 14: పీడీఎస్‌యూ స్థాపకుడు జార్జిరెడ్డి 52వ వర్ధంతిని ఆదివారం సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని ఆధ్వర్యంలో స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌లో నిర్వహించారు. తొలుత జార్జిరెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి, నివాళులర్పించిన అనంతరం నాని మాట్లాడుతూ విద్యార్థులందరికీ జార్జిరెడ్డి దిక్సూచి అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం కేంద్రంగా విద్యారంగ సమస్యల పరిష్కారంకోసం, విద్యార్థి హక్కులకై పోరాడి, మూకదాడులపై తిరుగుబాటుచేసిన విద్యార్థినాయకుడని కొనియాడారు. యశ్వంత్, దామోదర్, సురేష్‌నాయక్, రాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరులో..

కుక్కునూరు, ఏప్రిల్ 14: విద్యార్థి విప్లవ ఉద్యమ నాయకుడు జార్జిరెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీడీఎస్‌యు మండల నాయకులు కె.వెంకటేష్ అన్నారు. ఆదివారం కుక్కునూరులో జార్జిరెడ్డి 52వ వర్ధంతిని నిర్వహించారు. మతోన్మాదశక్తులకు వ్యతిరేకంగా జార్జిరెడ్డి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.రాజేష్, ఎం.సన్నీ, కె.శ్రీకాంత్, వి.సాయి, ఎం.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

రెసిప్షన్ కౌంటర్ అధికారులకు శిక్షణ

ఉంగుటూరు, ఏప్రిల్ 14: ఉంగుటూరు నియోజకవర్గంలో రెసిప్షన్ సెంటర్‌లో పనిచేసే సిబ్బంది వంద మందికి ఆదివారం సాయంత్రం ఏలూరు ఆర్డీవో, ఉంగుటూరు రిటర్నింగు అధికారి ఖాజావలి శిక్షణ ఇచ్చారు. మే 13న పోలింగ్ ముగిసిన అనంతరం పాల్గొనే సిబ్బంది ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటర్ వారిగా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

పేద కుటుంబానికి జనసేన నాయకుల సహాయం

చింతలపూడి, ఏలూరు 14: పట్టణంలోని గణేశ్ కాలనీలో నివాసం ఉంటున్న పేద కుటుంబానికి జనసేన నాయకులు ఆర్థిక సహాయం అందించారు. జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి నాగవిజయ్‌కుమార్ రూ.8,500 ఆ కుటుంబానికి అందజేశారు. ఈ కుటుంబంలో షేక్ మైమునాకు వివాహం సందర్భంగా ఆర్థికసహాయం అందించారని ఆయన చెప్పారు. దుర్గాభవాని, భారతి, సీతారామయ్య నాగరాజు, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెదవేగి, ఏప్రిల్ 14: కూచింపూడిలోని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో వార్షిక నిర్వహణ పనుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కూచింపూడి, న్యాయంపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. వినియోగదారులు సహకరించాలని పెదవేగి ఏడీ పి.శ్రీనివాస్ తెలిపారు.

అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌పై అవగాహన

పెదపాడు, ఏప్రిల్ 14 : వట్లూరు సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ అంశంపై కళాశాల అధ్యాపకులకు ఒక్కరోజు వర్క్‌షాపును ఆదివారం నిర్వహించారు. నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ హెచ్‌వోడీ బి.వెంకటశివ రిసోర్స్‌పర్సన్‌గా హాజరయ్యారు. విద్యాబోధన, సిలబస్ పూర్తి చేయడంతో పాటుగా పలు అంశాలను వివరించారు. ప్రిన్సిపాల్ శైలజ, రూప్సీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాహనాల విస్తృత తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది

ముదినేపల్లి, ఏప్రిల్ 14: ముదినేపల్లి మండలంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా జరుగుతోంది. ఎస్ఎస్ టి చెక్ పోస్టు వద్ద అధికారులు ఆదివారం 140 వాహనాలను తనిఖీలు చేశారు. కైకలూరు సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ వెంకట్ ఖుమార్, చెక్ పోస్టు ఇన్‌చార్జ్, మండల పరిషత్ ఏవో రమణబాబు ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను తనిఖీ చేశారు. మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు డ్రైనేజీ ఏఈలు కుమార్, భోగేంద్ర ప్రసాద్ తదితరులు పలు చోట్ల వాహనాల తనిఖీలను నిర్వహించారు.





అంబేడ్కర్ విగ్రహాలకు నూజివీడులో పార్థసారథి, వైవాకలో దళిత నాయకుడు ప్రసాద్, జనార్దనవరంలో స్థానికుల నివాళులు



ఆగిరిపల్లి టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన నివాళి

అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

»జయంతి వేడుకల్లో వక్తలు » ఘనంగా నివాళులు

నూజివీడు/నూజివీడు టౌన్, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీమ్‌రావ్ అంబేడ్కర్ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. నూజివీడు శ్రీనివాసా సెంటర్లో ఆయన విగ్రహానికి నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. టీడీపీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు మల్లిశెట్టి జగదీష్, మాజీ కౌన్సిలర్లు గొల్లు దుర్గాదేవి, కదం కండోజీ, పాదం సత్యనారాయణ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు హరికోటి సంగీత రావు, బీజేపీ నాయకులు వాసు, మాటూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సీపీఎం నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రాజు, పట్టణ కార్యదర్శి హనుమాన్లు, నాయకులు దుర్గారావు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు. బత్తుల వారిగూడెంలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు ముసునూరి రాజా, సర్పంచ్ లక్ష్మీకాంతమ్మ పూలమాలవేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని దశదిశలా చాటాలని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో ఆయన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నూజివీడు మాజీ వైస్ ఎంపీపీ తాళం వెంకటేశ్వరరావు, కొండా మంగయ్య తదితరులు పాల్గొన్నారు. నూజివీడు కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థి మరీదు కృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీడీ రవికుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు యార్లగడ్డ ఆంజనేయులు, పల్లెపాం ప్రసాద్, గోళ్ళ పవన్‌కుమార్, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలి

ముసునూరు: భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని అధికారులు సూచించారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని తహసీల్దార్ జవహర్ బాజి, ఎస్ఐ పి.వాసు, ఎంపీడీవో సీహెచ్.పద్మావతిదేవి తమ కార్యాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముసునూరు, కాట్రేనిపాడు, రమణక్కపేట, వేల్పుచర్ల తదితర గ్రామాల్లో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించి, అన్నదానం చేశారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో పనిచేయాలి

చాట్రాయి: అంబేడ్కర్ స్ఫూర్తితో పనిచేయడమే ఆయనకు నిజమైన నివాళి అని వక్తలు పేర్కొన్నారు. చాట్రాయి సచివాలయం, దళితవాడలో, చనుబండ, సూరంపాలెం, జనార్దనవరం, కరుణాపురం గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు అధికారులు, నాయకులు, ప్రజలు పూలమాలలు వేసి నివాళులు అర్పించి మిఠాయిలు పంచారు. సూరంపాలెం దళిత యూత్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్సీఎం ఫాదర్ జయరాజు, ఈవోపీఆర్డీ మురళీకృష్ణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, నాయకులు మోరంపూడి శ్రీనివాసరావు, జె చార్లెస్, డాక్టర్ నాగేశ్వరరావు, ఓబిళ్ళనేని రాజా, సంజీవరెడ్డి, నక్కా రాము, దారా రాజు, భాస్కరరావు, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు కొవ్వలి బాబూ రావు, టీడీపీ కార్యాలయంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పామర్తి నరసింహారావు అధ్యక్షతన జరిగిన జయంతి వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకుడు చౌటపల్లి విక్టర్ పాల్గొన్నారు. హైస్కూల్ కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఎస్టీయూ ఏలూరు జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ తాడి నరసింహారావు పూలమాలవేసి నివాళుల ర్పించారు. సర్పంచ్ చౌటపల్లి లక్ష్మి, ఎస్సై సురేంద్రకుమార్, అబ్దుల్ హక్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

విదేశీ విద్య పేరు మార్పు అవమానకరం..

కైకలూరు, ఏప్రిల్ 14: అంబేడ్కర్ విదేశీ విద్యను జగన్ విదేశీ విద్యగా పేరు మార్చడం రాజ్యాంగ నిర్మాతను అవమానించడమేనని కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రశ్నించారు. ఆదివారం కైకలూరు తాలుకా సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచారన్నారు. కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, వేంపాటి విష్ణురావు, తేరా రమేష్‌బాబు, పి. రాధాకృష్ణ, ఎండీ జానీ, వాసిపల్లి సతీష్ కన్నా, కట్టా వీరరాఘవులు, వీరాబత్తిన సుధా, గాలి ప్రసాద్ పాల్గొన్నారు. కైకలూరు టౌన్ పోలీసు స్టేషన్లో సీఐ ఆకుల రఘు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి ఆర్టీసీ బస్ స్టేషన్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, పార్టీ నాయకులు వీరమల్లు నరసింహారావు, చలసాని జగన్మోహనరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, నియోజకవర్గ కన్వీనర్ పైడిపాటి శివశంకర్, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముదినేపల్లిలో కొడాలి వినోద్ కార్యాలయం వద్ద కామినేని పతాకాన్ని ఆవిష్కరించారు. దళిత సంఘాల కార్యాలయంలో మాల మహానాడు అధ్యక్షుడు బాబూరావు, జిల్లా అధ్యక్షురాలు లావణ్య, మాదిగ దండోరా అధ్యక్షుడు దానియేలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండి: కలిదిండిలో అంబేడ్కర్ విగ్రహానికి కైకలూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, కూటమి నాయకులతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ గొప్ప మేధావి అని కొనియాడారు. టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, జనసేన నాయకుడు చలపతిరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. భాస్కరరావుపేట, పెదలంక, మట్టగుంట, గుర్వాయిపాలెం, కొండంగి గ్రామాల్లో దళిత సంఘాల నాయకులు బోడిగడ్డ కిషోర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: హస్తకళల బోర్డు మాజీ డైరెక్టర్, దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడపాటి వరప్రసాద్ వైవాకలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితుల అభ్యున్నతికి అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని ప్రశంసించారు. కోడూరులో టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ కార్యకర్తలు, దళిత నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మండవల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా మండవల్లి, పెరికేగూడెం గ్రామాల్లోని అంబేడ్కర్ విగ్రహాలకు కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని యువత ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.



కొండంగిలో దళిత సంఘాల నాయకుల నివాళి



ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో అంబేడ్కర్‌కు నివాళులు




మండవల్లి, ముదినేపల్లిల్లో అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి కామినేని



సూరంపాలెం గౌడబజారులో పార్థసారథి ఇచ్చిన మోటారు

పార్థసారథి మోటారు వితరణ

చాట్రాయి, ఏప్రిల్ 14: సూరంపాలెం గౌడబజారులో తాగునీటి ఎద్దడి నివారణకు నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి మోటారు ఏర్పాటు చేశారు. ఇటీవల పార్థసారథి ఆత్మీయ సమావేశానికి చనుబండ రాగా స్థానిక మహిళలు ఆయన్ని కలసి తాగునీటి ఇబ్బందులు గురించి వివరించటంతో సొంత నిధులతో మోటారు అమర్చారు. దీంతో స్థానికులు పార్థసారథికి కృతజ్ఞతలు తెలిపారు.

మజ్జిగ వితరణ



ఆగిరిపల్లి, ఏప్రిల్ 14: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఇండియన్ యాక్ట్ అవేర్‌నెస్ ఆర్గనైజేషన్, శ్రీ భాగ్యలక్ష్మి ఇండేన్ గ్యాస్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ జరిపారు. గ్యాస్ కంపెనీ మేనేజింగ్ పార్ట్‌నర్ పాలడుగు శ్రీనివాస్ సహకారంతో వెయ్యి గ్లాసుల మజ్జిగ పంపిణీ చేశారు. ఇండియన్ యాక్ట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ లాల్ సాహెబ్ పాల్గొన్నారు.

పర్వతనేని శ్రీధర్ బీజేపీలో చేరిక

ముదినేపల్లి, ఏప్రిల్ 14 : ముదినేపల్లికి చెందిన పర్వతనేని శ్రీధర్ బీజేపీలో చేరారు. గతంలో తెలుగుదేశం పార్టీలో చురుగ్గా వ్యవహరించి గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న శ్రీధర్ బీజేపీలో చేరారు. కైకలూరు కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకున్నారు.

టీడీపీలో చేరిక దాకరం శ్రీనివాస్

ముదినేపల్లి రూరల్, ఏప్రిల్ 14: వణుదుర్రు శివారు కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు దాకరపు శ్రీనివాస్ ఆదివారం టీడీపీ నాయకుడు కొడాలి వినోద్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరగా ఆయనకు వినోద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ ప్రభుత్వంలో దళితులను వేధింపులకు గురి చేయటంతో దళిత నాయకులు అధికార పార్టీని వీడి టీడీపీలో చేరుతున్నారని వినోద్ అన్నారు. చల్లగుళ్ళ ఆదిత్య, పోసిన పాండురంగారావు, జాస్తి రాజా తదితరులు పాల్గొన్నారు.



పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరిన వేణుబాబు

పలువురు టీడీపీలో చేరిక

ఆగిరిపల్లి, ఏప్రిల్ 14: ఆగిరిపల్లి మండలం సగ్గూరు వైసీపీ నాయకుడు, కలువకొలను రామచంద్ర బాపనయ్య కుమారుడు వేణుబాబు ఆధ్వర్యంలో వంద కుటుంబాలు పార్థసారథి సమక్షంలో టీడీపీలో చేరారు. సగ్గూరు గ్రామ టీడీపీ నాయకులు పునునూరి సత్యనారాయణ, మండల తెలుగు మహిళ నాగమణి కార్యకర్తలు పాల్గొన్నారు.



మర్లపాలెంలో అ'పూర్వ' కలయిక

చాట్రాయి, ఏప్రిల్ 14: మండలంలోని మర్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో 1988 నుంచి 1997 వరకు చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం ఆనందోత్సాహాల నడుమ జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉద్యోగ, వ్యాపార రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ కుటుంబాలతో సహా వచ్చి నాటి స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. పూర్వ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. నాటి గురువులను సన్మానించారు.



కొల్లేరు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న కామినేని శ్రీనివాస్



నూజివీడు అభ్యర్థి పార్థసారథికి హారతులిస్తున్న మహిళలు

కొల్లేరు సమస్య పరిష్కరిస్తా : కామినేని

కైకలూరు, ఏప్రిల్ 14: కొల్లేరు ప్రజల అభివృద్ధికి కాంటూరు కుదింపే శాశ్వత పరిష్కారమని అందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని కైకలూరు అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కైకలూరు మండలం పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప, పందిరిపల్లిగూడెం, గుమ్మళ్ళపాడు, శృంగవరప్పాడు గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కామినేనితో మాట్లాడుతూ కరోనా కాలంలో సైతం సీఎం సహాయనిధికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు పట్టుబట్టి తమ నుంచి గ్రామ గ్రామాన రూ.2 లక్షలు చొప్పున వసూలు చేశారన్నారు. కరోనా కాలంలో తమను ఆదుకోవాల్సిన నాయకులే ముక్కు పిండి డబ్బులు వసూలు చేయడం తమని బాధించిందన్నారు. ప్రభుత్వ భవన నిర్మాణాల కోసం కొల్లేరు గ్రామాల నుంచి భారీ ఎత్తున డబ్బు వసూలు చేశారని కామినేనికి తెలపగా తనను గెలిపించి అసెంబ్లీకి పంపితే కొల్లేరు సమస్య పరిష్కారమవుతుందని, ఐదేళ్లుగా కొల్లేరు అభివృద్ధి ఊసెత్తని వైసీపీ నాయకులకు గుణపాఠం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కొల్లేరు సంక్షేమాన్ని విస్మరించారన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రజా విరాళం సేకరించి లక్షలాది రూపాయిలు దుర్వినియోగం చేశారన్నారు. కరోనా కష్టకాలంలో సైతం ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన నాయకులకు గుణపాఠం చెప్పాలన్నారు. గ్రామగ్రామాన ఆయనకు ఘన స్వాగతం లభించింది. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ మండల అధ్యక్షులు పెన్మెత్స త్రినాథరాజు, కూటమి నాయకు లు గంగుల ఏసురాజు, పేరిచర్ల ప్రసాదరాజు, కాంట్రాక్టర్ కృష్ణంరాజు, పైడిపాటి శివశంకర్, డాక్టర్ సీఎల్ వెంకట్రావు, కొల్లి వరప్రసాద్, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి : కొలుసు

నూజివీడు, ఏప్రిల్ 14: సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండూ ముందుకు సాగాలంటే టీడీపీని అధికారంలోకి తేవాల్సిన అవసరం ఉందని, నూజివీడు కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మండలం తుక్కులూరు, జంగంగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ప్రజాసంక్షేమం కోసం సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు మేనిఫెస్టోలో పొందుపరిచారని 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు రూ.1500 ఆడబిడ్డ నిధి కింద ఇస్తారని, తల్లికి వందనం పథకంలో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అందరికి ఏడాదికి రూ.15వేలు ఇస్తారన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, వైసీపీ పాలనలో అరకొర జీతంతో పనిచేస్తున్న వలంటీర్లకు నెలకు రూ.10 వేలు గౌరవవేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

ప్రాధాన్య క్రమంలో సమస్యల పరిష్కారం..

ఆగిరిపల్లి: సగ్గూరులో నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి పర్యటించి గ్రామ సమస్యలు తెలుసుకుని పార్టీ అధికారంలోకి రాగానే ప్రాధాన్య క్రమంలో పూర్తిచేస్తానని తెలిపారు.

నవమికి ఆలయాలు ముస్తాబు



ముదినేపల్లి, ఏప్రిల్ 14: నవమికి ముదినేపల్లి మండలంలోని రామాలయాలు ముస్తాబవుతున్నాయి. ముదినేపల్లిలోని పెదరామాలయంలో శ్రీరామనవమి వేడుకలకు దేవదాయ, ధర్మదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. పెదగొన్నూరు, బొమ్మినంపాడు, విశ్వనాద్రిపాలెం, చేవూరు, పేరూరు తదితర గ్రామాల్లోని రామాలయాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.

నేటి నుంచి సీతారామ కల్యాణోత్సవాలు



కలిదిండి, ఏప్రిల్ 14 : అపర భద్రాద్రి తాడినాడరామాలయంలో స్వామివారి కల్యాణోత్సవాలు ఈ నెల 15 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నామని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 17న ఆలయ ఛైర్మన్ అల్లూరి శివాజీ దంపతులు కల్యాణం నిర్వహిస్తారన్నారు. ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఉత్సవాల్లో పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నామని ఎస్ఐ ప్రియకుమార్ తెలిపారు.

ముఖ్యమంత్రిపై దాడికి డీజీపీదే బాధ్యత

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 14: ముఖ్యమంత్రి జగన్‌పై రాయితో దాడి హత్యాయత్నమే అయితే డీజీపీ బాధ్యత వహించాలని, సీబీ ఐ విచారణ జరిపించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేష అన్నారు. వేగవ రంలో టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ ఆధ్వర్యంలో బీసీసెల్ అధ్యక్షుడు బుసా సత్యనారాయణ రెడ్డి అధ్యక్షతన ఆదివారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు.



ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలకు తరలిస్తున్న అధికారులు

స్ట్రాంగ్ రూంలకు చేరుకున్న ఈవీఎంలు

కైకలూరు, ఏప్రిల్ 14: సార్వత్రిక ఎన్నికలకు ఈవీఎంలు స్ట్రాంగ్ రూంలకు చేరాయి. ఆదివారం కైకలూరు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంలకు కైకలూరు అసెంబ్లీకి చెందిన 235 పోలింగ్ కేంద్రాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్‌లు, వీవీ ప్యాట్లు తరలించారు. టీడీపీ, వైసీపీ, బీజేపీ నాయకుల సమక్షంలో ప్రత్యేక వాహనంలో తీసుకువచ్చిన ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలో ఆర్వో కె భాస్కర్ ఆధ్వర్యంలో భద్రపరిచారు. పార్లమెంట్ స్థానానికి సంబంధించిన ఈవీఎంలు రెండు రోజుల్లో వస్తాయని అధికారులు తెలిపారు.

వాహనాల విస్తృత తనిఖీలు



ముదినేపల్లి, ఏప్రిల్ 14: ముదినేపల్లి మండలంలో వాహనాల తనిఖీ ముమ్మరంగా జరుగుతోంది. ఎస్ఎస్ టి చెక్ పోస్టు వద్ద అధికారులు ఆదివారం 140 వాహనాలను తనిఖీలు చేశారు. కైకలూరు సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ వెంకట్ కుమార్, చెక్‌పోస్టు ఇన్‌చార్జ్ మండల పరిషత్ ఏవో రమణబాబు ఆధ్వర్యంలో ప్రతి వాహనాన్ని, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులను నిశితంగా తనిఖీ చేశారు. మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు డ్రైనేజీ ఏఈలు కుమార్, భోగేంద్ర ప్రసాద్ తదితరులు పలు చోట్ల వాహనాల తనిఖీలను నిర్వహించారు.



టెక్‌జెట్‌లో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ముగిసిన టెక్‌జెట్

నూజివీడు, ఏప్రిల్ 14: ఆర్జీయూకేటీ పరిధిలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న టెక్‌జెట్-24 టెక్నో మేనేజ్‌మెంట్ ఎక్స్‌పో ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా పీయూసీ విభాగం నుంచి 35 మంది విద్యార్థులు మెటావర్స్ ఆర్ట్ ఎక్స్‌పో కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ విభాగాల నుంచి పలు సాంకేతిక ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శనకు ఉంచారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ చంద్రశేఖర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ గోపాలరాజు, సెంట్రల్ డీన్ శ్రావణి, ఏవో టి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



నూజివీడు టౌన్, ఏప్రిల్ 14: వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు ఫైర్ ఆఫీసర్ కేవీ విశ్వనాథ్ అన్నారు. నూజివీడు ఫైర్‌స్టేషన్‌లో అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ప్రారంభించి అగ్నిమాపక అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ వేసవిలో అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, వ్యవసాయ పనుల్లో భాగంగా నిర్లక్ష్యంగా చెత్తకు నిప్పుపెట్టడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

19 నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 14: జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు ఈ నెల 19 నుంచి నూజివీడులో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.చక్రవర్తి తెలిపారు. నూజివీడు బెతస్థ సీబీఎస్‌ఈ క్యాంపస్‌లో ఈ నెల 19 నుంచి 22 వరకు పోటీలు జరుగుతాయన్నారు.

నేడు జిల్లా జట్ల ఎంపిక

నూజివీడు బేతస్థ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ బాస్కెట్‌బాల్ జట్ల ఎంపికను నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు జి. సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. 2006, జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

రేపు గౌడ, శెట్టిబలిజ ఆత్మీయ సమావేశం

కైకలూరు, ఏప్రిల్ 14: కైకలూరు సీఎన్నార్ గార్డెన్లో ఈ నెల 16వ తేదీన గౌడ, శెట్టిబలిజ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు జరిగే సమావేశంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి కొనకళ్ల నారాయణ, ఏలూరు ఎంపీ కూటమి అభ్యర్థి పుట్టా మహేష్ కుమార్‌యాదవ్, కైకలూరు నియోజకవర్గ అసెంబ్లీ కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, గౌడ సంక్షేమ సంఘం ప్రముఖ నాయకులు పాల్గొంటారని గౌడ సంఘీయులంతా పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.



గ్రామసభల్లో సమస్యల హోరు

ముసునూరు, ఏప్రిల్ 14: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆదివారం సచివాలయాల వద్ద గ్రామసభలను నిర్వహించారు. పంచాయతీ, సచివాలయ కార్యదర్శుల ఆధ్వర్యంలో జరిగిన ఈ గ్రామసభల్లో డ్రైనేజీ, మంచినీరు, రహదారి సమస్యలను గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మౌలిక సదుపాయాల కల్పనకు పంచాయతీల్లో నిధులు లేవని, ఆర్థిక సంఘాల నిధులను పంచాయతీల ఖాతాల్లో వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ప్రసాద్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.